నమ్మలేని నిజాలు

దసరా కాంతి
తెచ్చింది జనాశాంతి
వానల వాత.

ఆక్వా కమతం
అభిమంతం ఉత్పత్తి
రైతుకు లాభం.

చెట్టు మనిషి
నీడనిచ్చే వరకే
రంపపు కోత.

హౌతీల దాడి
సముద్రం రంగెక్కింది
శాంతి మార్గాలు.

సొంతింటి కల
కలనిజమగునా
ఆశల గూడు.

– రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

శ్రీనిజాలు

అతిపెద్దది సహజ వనరు
గోదావరి కన్నతల్లి !
తాగునీరు అందించే
కామధేను కల్పవల్లి !
కాలయాపన చేయొద్దు
తిట్టుకుంటు నిత్యం !
కరువు ముంచుకొస్తుందోయ్
కఠిన నగ్న సత్యం !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 15-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:64 పేజీలు:6 వెల: రూ.1/-


# ప్రధాని మోదీ – 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి రాష్ట్రాల సహకారం అవసరం: సీఎం రేవంత్



హైదరాబాద్, అక్టోబర్ 14:(నేటినిజం ప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ – 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారని.. ఇందుకు రాష్ట్రాల సహకారం అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని.. అభివృద్ధి విషయంలో కాదని స్పష్టం చేశారు. 2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతుందని తెలిపారు. సమాఖ్య అనే పదానికి చాలా బలం ఉందని చెప్పుకొచ్చారు. పురాతన కాలంలో వస్తు మార్పిడి పద్ధతి ద్వారా వ్యాపారం చేసేవారని పేర్కొన్నారు. ఆధునిక యుగంలోనూ సమాఖ్యల అవసరం చాలా ఉందని వెల్లడించారు. ఈరోజు (బుధవారం) హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్–2026ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి, ప్రసంగించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఆధునిక కాలంలో వస్తున్న మార్పులను తెలుసుకోవడానికి, అందిపుచ్చుకోవడానికి సమాఖ్యలు చాలా ఉపయోగపడుతాయని వివరించారు. కొత్త తరం అభివృద్ధి చెందాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సినిమా, రాజకీయ రంగాల్లో మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి వివిధ హోదాల్లో రాణించారని కొనియాడారు. ఉన్నత శిఖరాలకు ఎదగడమే కాదని.. అందరికీ ఆదర్శంగా వారు నిలిచారని ఉద్ఘాటించారు. సక్సెస్ స్టోరీలను సమాఖ్య నిక్షిప్తం చేసి కొత్త తరానికి అందించాలని పిలుపునిచ్చారు. అందుకే 2025లో తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని ప్రస్తావించారు.

**తెలంగాణను మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం..**

2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాష్ట్రాన్ని CURE, PURE, RARE అని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని CURE, (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఇక్కడ ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని PURE (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేసుకుంటున్నామని వివరించారు. ఈ ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహిస్తామని అన్నారు. మిగిలిన గ్రామీణ ప్రాంతాలను RARE (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకొచ్చారు.

**తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం..**

ఇక్కడ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయాధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్నదే తమ సంకల్పమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ 5 శాతం కంట్రిబ్యూట్ చేస్తోందని అన్నారు. దీన్ని 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని వివరించారు. నాలుగు వందల ఏళ్ల క్రితమే దేశ, విదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకు చార్మినార్ ల్యాండ్ మార్క్‌గా మారిందని ఉద్ఘాటించారు. చార్మినార్ తర్వాత బిజినెస్‌కు ల్యాండ్ మార్క్.. హైటెక్ సిటీ అని చెప్పుకొచ్చారు. నూతన పారిశ్రామిక విధానంలో మీరంతా భాగస్వాములు కావాలని సూచించారు. ఇప్పటి వరకు మనవాళ్లు కేవలం కార్పొరేట్ కంపెనీలకు సర్వీస్ చేసే వైపు మాత్రమే ఉన్నారని వెల్లడించారు. మన ప్రాంతానికి చెందిన వాళ్లు పెట్టుబడులు పెట్టి గ్లోబల్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

**మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయి..**

ఒకసారి మనం ప్రపంచాన్ని గమనిస్తే.. మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో మహిళలకు రూ. 61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని చెప్పారు. ఆర్టీసీ బస్సులకు, పెట్రోల్ బంకులకు, సోలార్ ప్లాంట్స్‌కు మహిళలను యజమానులను చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సీఎం ఓ సూచన చేశారు. యువతతో పాటు మహిళలను ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం వైపు నుంచి కావాల్సిన సహకారం అందిస్తామని తెలిపారు. మంచి విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని వెల్లడించారు. 'మీ పెట్టుబడులకు మా భరోసా' ఉంటుందని భరోసా కల్పించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా ముందుకెళ్దామని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

సమాఖ్య సమ్మిట్‌కు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణమ రాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీ ప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ ఛైర్మన్ సత్తు మల్లేశ్, తదితరులు హాజరయ్యారు. ఇవాళ, రేపు రెండు రోజులపాటు SAMAKHYA Chamber of Commerce (SCC) ఆధ్వర్యంలో హైటెక్స్‌లో సమాఖ్య (SAMAKHYA) బిజినెస్ సమ్మిట్–2026 జరగనుంది.

# సంగీతం, నృత్యం, సినిమాలతో ప్రపంచంతో అనుబంధం

**–భారతీయ వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యం**
**–ప్రాచీన లిఖిత ప్రతుల సంరక్షణకు 'జ్ఞాన్ భారత్'**
**–ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ సంగీతం, నృత్యం, సినిమా, వంట కాలు ప్రపంచ వ్యాప్తంగా వివిధ సమాజాలను భారత్‌తో అనుసంధానిస్తున్నాయని పేర్కొన్నా రు. దేశ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు.

న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అక్టోబర్ 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్న 'బృహత్తర భారత్: ప్రపంచవ్యాప్తంగా భారత సాంస్కృతిక సంబంధాలు' అనే అంతర్జాతీయ సదస్సుకు హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి ప్రధాని రాతపూర్వక సందేశం పంపారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి విశిష్టతను, ప్రపంచ దేశాలతో భారత్‌కు ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను వివరించారు.

భారతీయ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ అంటే కేవలం చారిత్రక కట్టడాలను కాపాడటమే కాదని మోదీ పేర్కొన్నారు. దేశంలో తరతరాలుగా భద్రపరిచిన ప్రాచీన మాన్యుస్క్రిప్టులు, లిఖిత ప్రతుల సంరక్షణ కూడా అంతే ముఖ్యమని తెలిపారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం 'జ్ఞాన్ భారత్' కార్యక్రమం ద్వారా భారతీయ లిఖిత వారసత్వాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపడుతోందని వెల్లడించారు.

# ఆటోలో సినిమా.. చెవుల్లో హెడ్‌ఫోన్లు! ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం..



హైదరాబాద్, అక్టోబర్ 14: ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఆటో డ్రైవర్.. తన వినోదం కోసం వారి ప్రాణాలనే ప్రమాదంలోకి నెట్టాడు. ఒకవైపు గమ్యస్థానాన్ని చూపించే నావిగేషన్ కోసం ఫోన్.. మరోవైపు సినిమా చూసేందుకు ఇంకో ఫోన్.. చెవుల్లో రంగురంగుల లైట్లు వెలిగే హెడ్‌ఫోన్లు! ఇలా డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపై వెళ్లిన ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ఆటోను గుర్తించి, డ్రైవర్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు.

ఒక నెటిజన్ పంపించిన వీడియోను సీపీ సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. అందులో ఆటో డ్రైవర్ ఒక ఫోన్‌లో నావిగేషన్ చూస్తూ, మరో ఫోన్‌లో సినిమా చూస్తున్నట్లు కనిపిస్తోంది. అదే సమయంలో చెవులకు హెడ్‌ఫోన్లు పెట్టుకుని వాహనాన్ని నడుపుతున్నాడు. చూడటానికి ఇది ఒకేసారి పలు తెరలను వినియోగించే విన్యాసంలా కనిపించినా.. ఆటోలో ప్రయాణిస్తున్నవారి భద్రతకు తీవ్ర ముప్పు కలిగించే చర్య అని సజ్జనార్ హెచ్చరించారు.

**క్షణకాల నిర్లక్ష్యం.. పెను ప్రమాదం**

వాహనం నడిపేటప్పుడు డ్రైవర్ దృష్టి నిరంతరం రహదారిపైనే ఉండాలి. క్షణకాలం చూపు పక్కకు మళ్లినా ఎదురుగా వచ్చే వాహనాలు, రహదారిపై ఉన్న పాదచారులు, ఆకస్మికంగా ఎదురయ్యే అడ్డంకులను గుర్తించడం కష్టమవుతుంది. అలాంటిది సినిమా చూస్తూ, హెడ్‌ఫోన్లు పెట్టుకుని డ్రైవింగ్ చేయడం మరింత ప్రమాదకరం. వినోదం కోసం ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని పోలీసులు సూచిస్తున్నారు.

**చట్టపరమైన చర్యలు తప్పవు**

డ్రైవింగ్ సమయంలో ఫోన్ వినియోగం, రహదారిపై దృష్టి నిలవకపోవడం ప్రమాదాలకు దారితీసే తీవ్రమైన నిర్లక్ష్యం. పరిస్థితులు, ఉల్లంఘన స్వభావాన్ని బట్టి మోటారు వాహనాల చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. నిబంధనలకు అనుగుణంగా జరిమానాలు విధించడంతోపాటు, వర్తించే సందర్భాల్లో డ్రైవింగ్ లైసెన్స్‌పై కూడా చర్యలు తీసుకోవచ్చు. ఈ నేపథ్యంలో సంబంధిత ఆటోను గుర్తించి, డ్రైవర్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సజ్జనార్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు.

ఆటో, కారు, బస్సు లేదా ఇతర వాహనం ఏదైనా.. డ్రైవర్ ఫోన్ చూస్తూ, హెడ్‌ఫోన్లు లేదా ఇయర్‌బడ్స్ పెట్టుకుని వాహనం నడుపుతున్నట్లు గమనిస్తే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి. సురక్షితంగా స్పందించే అవకాశం ఉన్నప్పుడు డ్రైవర్‌కు సూచించి, ప్రమాదకరమైన ప్రవర్తనను ఆపేలా చూడాలి. పరిస్థితి ప్రమాదకరంగా ఉంటే వాదనకు దిగకుండా సురక్షితంగా బయటపడాలి. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించవచ్చు.

**మీ అప్రమత్తతే రక్షణ కవచం**

రోడ్డుపై వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తమ భద్రతతోపాటు ఇతరుల ప్రాణాల బాధ్యతనూ గుర్తుంచుకోవాలి. డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం, దృష్టి మరల్చే వినోద కార్యక్రమాలు, శబ్దాలను వినకుండా చేసే పరికరాలకు దూరంగా ఉండాలి. డ్రైవర్ నిర్లక్ష్యం ఒక్కరినే కాదు.. వాహనంలో ఉన్న ప్రయాణికులతోపాటు రోడ్డుపై వెళ్లే ఇతరులనూ ప్రమాదంలోకి నెట్టవచ్చు. కాబట్టి వినోదం కంటే భద్రతకే ప్రాధాన్యమివ్వాలి. అప్రమత్తంగా ఉండటం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

# బీఆర్ఎస్ హయాంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 14: బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల అవినీతిని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వివరించారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈరోజు (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. తొమ్మిది జిల్లాల్లో బీఆర్ఎస్ భూములు, హోటల్స్ అన్నీ బయట పెట్టారన్నారు. తమ వాయిస్ టాంపరింగ్ చేసి సోషల్ మీడియాలో బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు.ఏనుగు ఎక్కి ప్రగతి భవన్‌కు వెళ్తానని చెప్పిన వ్యక్తి ఇప్పుడు ఫాంహౌస్‌లో బందీ అయ్యారని ఎంపీ విమర్శించారు. 'నా పేరు మీద అసైన్డ్ భూములు ఉన్నా, 22ఏ జాబితాలో ఉన్నా, ఇల్లీగల్ భూములు ఉన్నా అక్కడికి మీరు వెళ్లండి. అక్కడే అధికారులను పిలిచి రాసి ఇచ్చేస్తా. తెలంగాణ సమాజానికి నన్ను విలన్‌గా చూపించాలని మాజీ ఐపీఎస్ ఆఫీసర్ మాట్లాడారు. అమెరికాలో 6 ఏళ్లు ఉండి ఫైవ్ స్టార్ హోటల్ కట్టుకున్నా అని కేటీఆర్ చెప్పారు. ఇంత తెలివి ఉన్న కేటీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని పాలిస్తే రూ.8 లక్షల కోట్ల అప్పు ఎలా అయింది' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఆర్టిస్టుల డ్రామాలు బంద్ చేయాలంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ హితవుపలికారు.

# జల వివాదాలకు తావివ్వొద్దు

**–రెండు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం సమావేశం నిర్వహించాలి**
**–శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



నల్గొండ, అక్టోబర్ 14:సాధించుకున్న తెలంగాణలో జిల్లాల మధ్య జల వివాదాలు సృష్టించడం సరికాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందించే పాలమూరు?రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పనులను వేగవంతం చేయాలని కోరారు. ఎదుల్ల రిజర్వాయర్ నీటి కేటాయింపులపై అనవసర వివాదాలు సృష్టించి ప్రజలను రెచ్చగొట్టడం తగదని, ప్రజాప్రతినిధులు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

**ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలి**

జల వివాదానికి శాశ్వత పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు. రెండు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలన్నారు.

**ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం**

వర్షాభావ పరిస్థితులు, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న దృష్ట్యా రైతులు నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రబీలో అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

**చురక**

రాజ్యాంగ వ్యవస్థల్లో
రాజనీతి నయనం
విపక్షాల భస్మానికే
విప్పి సాగే పయనం.
దాడులు దర్యాప్తుల
దండ రాజకీయం
ప్రజాస్వామ్య ఆత్మకు
పెడుతున్నది గాయం



–వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

తొలుగ మాత్సర్యంబు
వెలుగ వాత్సల్యంబు
బ్రతుకగును మధురంబు
అనును రాధశ్రీ !!
నివురు గప్పిన చురుకు
నిద్ర వదిలే వరకు
వెలుగు నకిలీ సరుకు
అనును రాధశ్రీ !!



–రాధశ్రీ
సెల్:9494481210

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు**
**ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి**



ములుగు, అక్టోబర్ 14:(నేటినిజం ప్రతినిధి): ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి సూచించారు.

బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయంలోని తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2026, వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులు, ముఖ్యంగా 18 నుంచి 19 ఏళ్ల యువత ఓటరు నమోదుకు ముందుకు రావాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు.



శనివారం "బాల గోకులం" బాలల సాహిత్య సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో "బాల గోకులం" దశ పంచమ వార్షికోత్సవంలో **బాలప్రియ అవార్డులు** అందుకున్న విద్వాన్ చొప్పా వీరభద్రప్ప, కాశీ విశ్వనాథం పట్రాయుడు, శ్రీమతి వురిమళ్ళ సునంద, గద్వాల సోమన్నలతో అతిథులు మణికొండ వేదకుమార్, పత్తిపాక మోహన్, చొక్కాపు వెంకట రమణ, అత్తలూరి విజయలక్ష్మి, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి తదితరులు.






# జింబో సాహిత్యంపై ప్రత్యేక సాహిత్య సమీక్ష



కవి, కథకుడు మంగారి రాజేందర్‌కు ఆంగ్ల కవితలు, కథల పుస్తకాన్ని అందజేస్తున్న సినీ దర్శకుడు బి.నర్సింగరావు.

హైదరాబాద్, అక్టోబర్ 14:(నేటినిజం ప్రతినిధి): లమకాన్‌లో ప్రముఖ కవి, కథకుడు జింబో సాహిత్యంపై ప్రత్యేక సాహిత్య సమీక్షా కార్యక్రమాన్ని అక్టోబర్ 8న గురువారం నిర్వహించారు. డా॥బి. నర్సింగరావు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డా॥సత్య నారాయణ ద్యావనపల్లి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డా॥బి. నర్సింగరావు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యానికి జింబో అందిస్తున్న విశిష్ట కృషి, ఆయన రచనల్లోని సామాజిక స్పృహ, జీవితానుభవాల ప్రతిఫలనాన్ని పాఠకులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. డా॥సత్యనారాయణ ద్యావనపల్లి జింబో రచనా ప్రస్థానాన్ని పరిచయం చేస్తూ సుమారు పది కథా సంకలనాలు, పది కవితా సంపుటాలతో పాటు తెలుగు భాషకు సంబంధించిన మరో గ్రంథం గురించి వివరించారు.

ఉమ్మడి కరీంనగర్ ప్రాంతానికి ప్రాచీన సాహిత్య వారసత్వం గొప్పదని, ఎంతో మంది కవి, కళాకారులను ఈ ప్రాంతం అందించిందని ద్యావనపల్లి పేర్కొన్నారు. అదే సాహిత్య పరంపరకు కొనసాగింపుగా ఆధునిక కాలంలో జింబో తనదైన రచనా స్వరాన్ని నిర్మించుకున్నారని అన్నారు. అనంతరం జింబో తన కథలు, కవితల్లోని ముఖ్యాంశాలను వివరించారు. కోర్టులు, న్యాయవ్యవస్థలో తనకు ఎదురైన అనుభవాలు. అక్కడి మానవ సంబంధాలు, సంఘర్షణలు తన రచనలకు ఎలా వస్తువులుగా మారాయో తెలిపారు.

అలాగే తన బాల్యం, వేములవాడతో అనుబంధాన్ని ప్రతిబింబించే 'వేములవాడ కథలు' గురించి వివరించారు. తన కథలను తల్లితో, కోర్టు నేపథ్యంలోని కథలను తండ్రితో పోల్చుతూ తన సాహిత్యంలో ఈ రెండు అనుభవ ప్రపంచాలకు ఉన్న ప్రత్యేకతను వివరించారు.

ఈ కార్యక్రమంలో సాహిత్యభిమానులు జింబో రచనలపై పలు ప్రశ్నలు అడగగా ఆయన సమాధానాలు ఇచ్చారు. జింబో సాహిత్యంలో వ్యక్తిగత అనుభవం, సామాజిక పరిశీలన, న్యాయవ్యవస్థ అనుభవాలు, బాలస్మృతులు, స్థానిక చరిత్ర, సంస్కృతుల సమ్మేళనం కనిపిస్తాయని ద్యావనపల్లి పేర్కొన్నారు. ఇలాంటి సాహిత్య సమీక్షలు రచనలను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డా॥ సత్యనారాయణ ద్యావనపల్లిని డా॥బి. నర్సింగరావుతో పాటు సాహిత్యాభిమానులు అభినందించారు.

# నేటి నిజం సాహితీ కెరటాలు

website:www.netinijam.com

website: www.netinijam.com




## నీవూ నేనే...

కెరటం కవిత్వం పక్కనుంటే
కెరటం కూలిపోతుంది కవిత్వం నిలిచిపోతుంది
ఫంక్షను పాకం పక్కనుంటే
ఫంక్షన్ అయిపోతుంది పాకం మిగిలిపోతుంది
నేను నువ్వు పక్కనుంటే
నేను విరిగిపోతాను నువ్వు వెలిగిపోతావు
నీకు వందలున్నారు నాకు ఒక్కరున్నారు
వందమంది కలబడితే ఒక్కడు నిలబడతాడు
యుద్ధం నువ్వు చేస్తావు ముద్దను నేను ఇస్తాను
యుద్ధం జరిగిపోతుంది ముద్ద మెరిసిపోతుంది
జీవితం నీవిస్తావు ఆలోచన నేనిస్తాను
జీవితం కరిగిపోతుంది
ఆలోచన విరిసి ఉంటుంది
నువ్వు పక్షివవుతావు నేను రెక్క ఇస్తాను
పక్షి ఎగిరిపోతుంది రెక్క రెపరెపలాడుతుంది
కవిత్వం నేను రాస్తాను వ్యాఖ్యానం నీవు చేస్తావు
కవిత్వం వెలుగులీనుతుంది వ్యాఖ్యానం దారి చూపుతుంది
ఆలోచన అవతారం ధరించి విశ్వవ్యాప్తమవుతుంది
నీవు వర్షిస్తూ ఉంటే నేను మొలకెత్తుతూ ఉంటాను
ప్రేమంటే మాటలతో మనసును మెలిపెట్టడం
ఒక్క మూసలో ఇద్దరూ ఒదిగుండడం
అప్పుడు ద్వంద్వం అద్వైతమౌతుంది.



-జి.నరసింహ స్వామి
సెల్:9441041475



# మనుష్యులూ, మనస్తత్వాలు ఇవి కథలు కావు యదార్థగాథలు

'పొత్తూరి' అన్న పదం/పేరు ఆంధ్ర ప్రజలకు, ముఖ్యంగా పాత్రికేయులకూ, సాహితీవేత్తలకూ, అలనాటి రాజకీయ నాయకులకూ చిరపరిచయం. వారి అడుగు జాడల్లోనే నడుస్తూ, సాహితీకిరణం పేరిట ఒక మాసపత్రికను, తెలుగు సాహిత్య ప్రక్రియల ఆశాకిరణంగా గత 18 సం॥లుగా నిర్విరామంగా, సర్వజనర ంజకంగా, కరోనాను అధిగమించి నిర్వహిస్తున్న విజేత మన పొత్తూరి సుబ్బారావుగారు. వీరికి రచనావ్యాసంగం ఒక వ్యసనం. కవితలూ, కథలూ, వ్యాసాలూ, సంపాదకీయాలూ వీరికి కొట్టినపిండి అయ్యాయి. ఇక ఇప్పుడిక ఏకంగా 'మనుష్యులూ మనస్తత్వాలు' అంటూ తాను విన్నవి, కన్నవి, అనుకు న్నవి, కథలు, కథలుగా అందించడం ఒక కొత్తకోణం అనిపించింది. వేదకాలంనుండీ ప్రతిదీ మనిషి చుట్టూరా తిరుగుతూనే ఉ న్నాయి. మనిషీ, మనుగడ, హితం, మతం, ఆపైన తత్వం. ఇదొక చక్రభ్రమణంలాగా యుగాలు మారినా, మంచీ, చెడ్డా అంటూ కథలు కథలుగ రూపాంతరం చెందింది. మానవ జీవితం ఈ భూమ్మీదకు ఎందుకోసం వచ్చింది? కేవలం పశు పక్ష్యాదుల వలే తినడం, త్రాగడం, నిద్రించడం కోసమేనా? ఈ విధమైన ఆలోచనలను మించి ఆలోచించడం మొదలుపెట్టిన పొత్తూరి వారు మానవత్వం అనేది ఒక అపురూప శక్తిగానెంచి, మనుష్యులనూ, వారి పోకడలనూ నిశితంగా గమనించి, వాటిని పదిలంగా భద్రపరచి, అక్షరాలుగా మలచి ఒక విధంగా అందరికీ కనువిప్పు కలిగేలా పుస్తక రూపంలో అందించారు.

మానత్వంలోని దివ్యత్వాన్ని గుర్తించి నప్పుడే, మనిషి ఈ సంఘంలో మంచిమ నిషిగా, మనీషిగా నిలుస్తాడు. అదెలా? మనచుట్టూ వున్న సాటి మనుష్యులను పరిశీలించాలి, వారి మనస్తత్వాలను అర్థం చేసుకోవాలి, వాటిని జనప్రియంగా, జనహితాలుగా అందించాలి. అలాంటి ప్రయోజనకరమైన పనే మన పొత్తూరివారి ఈ పుస్తక ప్రచురణ.వీరి కథల్లో ఒకటి 'మారుపేర్ల మతలబు' అన్నది చదివితే మనకు నిత్యం ఎక్కడో ఒకచోట నిక్‌నేమ్‌లతో జనం తగులుతూనే ఉంటారు. అయితే మన రచయిత, సంఘువిని బొచ్చుకుక్క అని పిలవడం, హెడ్‌మాస్టర్ నరసింహ ప్రసాద్‌ను ఏ విధంగా నల్లమొద్దు అన్నాడో రాసిన తీరు మనలను పట్టుకుని చదివిస్తుంది. చివరకు తనకే మారుపేరు పెట్టి ఆటపట్టించేసరికి జ్ఞానోదయం అయింది. మారుపేర్ల మతలబులు ఇట్లా ఉంటాయా అని మనక్కూడా అనిపించేలా రాయడం వీరి ప్రత్యేకత. గిట్టుబాటు లేకుండా ఏ పనీచేయని శమంతకమణి, తన ఆఫీసులోని వారిని కించపరచినట్లు మాట్లాడి చివరకు నవ్వులపాలైన తీరును చక్కగా వివరించారు.'ఊతపదాల ఉ బలాటం'లో నాకూ ఈ అలవాటు ఉంది. నేను 'నిజంగా' అన్న పదం వాడుతూ వుంటాను. సుబ్బా రావుగారు చెప్పినట్లుగా కొందరు 'సరిపోయింది' అంటూ వుంటారు. ఈ పదం ఒక సినిమాలోకూడా పాపులర్ అయింది. నేను కూడా నో ప్రాబ్లం అంటుంటాను. ఎగ్జాక్ట్లీ, కరెక్టు, వంటివి చాలామంది ఊతపదాలుగా వాడటంతో ఒక్కోసారి అసందర్భంగా అనిపించి నో ప్రాబ్లమ్ అన్న వారికే ప్రాబ్లమ్ తెచ్చి పెడుతుందన్న విషయాన్ని ఆఫీసులో జరిగిన ఒక సంఘటనతో చెప్పి నవ్వించారు పొత్తూరి. రిజర్వు బ్యాంకులో నేను పనిచేసే రోజుల్లో ఒక మంచి వ్యక్తి నత్తిరాజు అనీ ట్రెజరర్ క్యాష్ డిపార్ట్‌మెంటులోవుండే వాడు. ఆయన రెండు మాటలకొకసారి, 'దట్సాల్ ఎబౌట్ ఇట్ హియర్' అంటుండేవాడు. నాకు చాలా ఎమ్యూజియంగ్‌గా అనిపించేది. ఆ తరువాత నేనూ తమాషాగా మా ఫ్రెండ్స్‌డో అలానే అనేవాడిని. కామత్ హోటల్‌లో



ప్రతులకు: సాహితీకిరణం, ఇం.నెం. 11-13-154, రోడ్ నెం.3, అలకాపురి, హైదరాబాద్-500102, సెల్:9490751681



అక్టోబర్ 16న శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికపై తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారిగారిచే ఆవిష్కరించబడుతున్న పుస్తకానికి డా॥పులివర్తి కృష్ణమూర్తి రాసిన ముందుమాట.

కూర్చుని సరదాగా ఎంజాయ్ చేసేవాళ్ళము. సరే ఒక సినిమా పిచ్చి గురించి కూడా చెప్పారు మన రచయిత. ఓ ఆనందరావు కథను రంజుగా నాయకీయ పక్కీలో చెప్పుకు వచ్చారు. గొప్పలు చెప్పుకోవడం ఆనందరావుకు అలవాటు. ఇలాంటి వారిని సమాజంలో చాలామందిని చూస్తూనేవుం టాము. మన ఆనందరావు తాను అక్కినేని మేకప్‌లో ఎట్లా వుంటాడో ఈయన మేకప్ లేకుండా అలా ఉంటాడట. తాను వాళ్ళమ్మా యి ఫీజు కడదామని కాలేజీకి వెళితే అమ్మాయిలంతా చుట్టుముట్టారట. పాపం మన ఆనందరావు సినిమాపిచ్చిని, వొానగాళ్ళు ఎలా వదిలించారో చెప్పిన తీరు ఆసక్తికరంగా వుంది. పొత్తూరి సుబ్బారావుగారిలో ఎంత చిలిపిదనం ఉందో మనం 'పేరులోనే వున్నది పెన్నిధి' చదివితే తెలుస్తుంది. పేరు పెట్టడంలో వున్న పలురకాల అంశాలను, అంచెలంచెలుగా చమత్కారంగా చెప్పుకు వచ్చారు. సినీహీరోల మీద అభిమానం వున్నవాళ్ళు అమితాబ్‌మీదవున్న అభిమానంతో అతను నటించిన సినిమా పేరు 'డాన్' అని తన పిల్లవాడికి పేరు పెడితే, మరొకాయన షమ్మీకపూర్ మీద ఉ న్న అభిమానంతో 'జంగిలీ' అనీ, 'బత్తమీజ్' అనీ పేర్లు పెట్టారట.

ఇక మరో పెద్దమనిషికి ఇంకో రకమైన ఆలోచన వచ్చింది. ఎప్పుడూ జానకీదేవి అనీ సీతాదేవి అనీ ఎందుకు? మహాభారతంలో కథానాయకి ద్రౌపది కూడా పతివ్రతే కదా, ఆ పేరు తన కూతురికి ఎందుకు పెట్టకూడదనుకొని ద్రౌపది అని పెట్టేశాడు. ఆ తరువాత ఆమె ఎన్ని వివాదాల్లో ఇరుక్కుందో మరి!అలాగే 'తృప్తి' అని రెండక్షరాల పేరు వెరైటీగా ఉ ంటుందని ద్రౌపది తన కూతురికి పెడితే, ఆ తరువాత పడిన పాట్లు చదివితే నవ్వాగదు.

ఇక ద్రౌపది సోదరుడు ముకుందం తన ఇద్దరు ఆడపిల్లలకూ, అబ్బాయికి 'బుద్ధి' అనీ, అమ్మాయికి 'సిగ్గు' అనీ పేర్లు పెట్టుకున్నాడు. అంటే అతని ఉద్దేశం అబ్బాయి బుద్ధిగా ఉంటాడనీ, అమ్మాయి సిగ్గుపడుతూ ఉంటుందనీ ఆశ పడ్డాట్ట. సరే బాగానేవుంది... కానీ ఆ పిల్లలు కొంచెం పెద్దవాళ్ళు కాగానే, పిల్లల స్నేహితులు వచ్చి ముకుందాన్ని 'అంకుల్ బుద్ధి లేదా' అనీ, అలాగే సిగ్గు కోసం వచ్చేవాళ్ళు అమ్మాయి తల్లిని 'ఆంటీ సిగ్గు లేదా' అనడం మొదలు పెట్టారట.బాబోయ్ అనుకుని ఆ తరువాత ఆ తల్లిదండ్రులు పురాణాల్లోని పేర్లుగా మారుస్తున్నట్లు అఫిడవిట్ దాఖలు చేశారట. ఇలా కథంతా చెప్పి చివర్లో పేరులోనే ఉన్నది కదా పెన్నిధి అని వారనుకున్నారని ముగించారు. 'చెంప చెళ్ళ మంది' అన్న కథ చూద్దాం. ఉగాది వచ్చింది అంటే కవులు ఏ విధంగా బిజీ అయిపోతారో చెబుతూనే, కోయిలలు కనబడకపోయినా, కోకిల కూతలు కవులనోట వినబడుతూనే ఉంటాయట. ఇదిలా వుంటే 'చెంప చెళ్ళుమంది' అన్న కథలో హీరో ముకుందం అందమైన అమ్మాయి తనతో చనువుగా ఉంటే, స్లీవ్‌లెస్ బ్లౌజుతో వస్తే 'చోళీకే పీఛే క్యాహే' హిందీ సాంగును తెలుగులో పాడితే,ఆ అందగత్తె ఇందుమతికి కోపమొచ్చి ముకుందం చెంపను చెళ్ళు మనిపించిందట. అప్పటివరకు బోండం ముకుందం కాస్తా సి.హెచ్.ముకుందంగా మారిపోయింది. ఆ తరువాత ముకుందం పెద్ద అధికారి కావడం, దాంతో ఆయన కవితలు పత్రికల్లో రావడం, ఆయనో పబ్లిక్ ఫిగర్ అవ్వడం జరిగిపోయాయి. కానీ ఇందుమతికి నచ్చలేదనే చెప్పాలి. చివరకు ముకుందం భార్యచేత్తోనే చెంపదెబ్బ కొట్టించింది.

ఒకప్పుడు ఆయిల్ పుల్లింగ్ పద్ధతిని ఆంధ్రదేశంలో విపరీతంగా ఆదరించారు. ఒకప్పుడు ఆయిల్ పుల్లింగ్ ఒక గృహవైద్య ంగా మారిపోయింది. ఇలా ఆయిల్ పుల్లింగ్‌ను అందరికీ అంటకట్టినవాడే కార్పోరేట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుంటే, అంటూ ఆయిల్ పుల్లింగ్‌ను దూరం పెట్టేశారు జనం. అయితే పొత్తూరి వారు అన్నట్లుగా, తెలివిగల మనస్తత్వాలున్నవారు, తెలివిగలవారి సలహాలు పాటించేవారు ఏదో విధంగా బాగుపడతారు అన్నట్లుగా సంగమేశ్వర గుప్త ఆర్గానిక్ ఆయిల్స్ పేరిట వ్యాపారం లాభదాయకంగా చేస్తున్నాడట. ఈ కథకు పొత్తూరివారు 'పుక్కిలింత ఓ పులకరింత' అన్న పేరు పెట్టారు.

సలహాలు ఉచితం. కానీ మనం అడగకుండానే సలహాలు ఇచ్చేవారు వుంటారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగుండ నపుడు, సెకండ్ ఒపీనియన్ తీసుకోమంటారు. ఈ విషయాన్నే పొత్తూరివారు ఎంతో సంస్కారవంతంగా తెలియజేశారు.ఎవ్వరినీ భయపెట్టడం సరికాదు కదా! వాదనలోనే ఉంది మజా అన్న రచనలో, కొందరి వాదనలు ఏ విధంగా మేలు చేస్తాయో ఇందులో పొందుపరిచారు.

నిజాయితీగా పనిచేసేవారు ఎప్పుడూ నిక్కచ్చిగానూ, క్రమశిక్షణతోనూవుంటారు. అలాటివాడే సత్తెకాలపు ప్రసాద్. ఈ ప్రసాద్ నిజాయితీని నిరూపించే కథాగమనంను సాఫీగా సాగించారు.

కొన్ని ఆఫీసుల్లో కొందరు ఎంత వర్కు వున్నా తొణకరు, బెణకరు. ధైర్యంగా, సరైన ఆలోచనతోనేవుండాలని కళ్యాణరావు వంటి ఉద్యోగుల గురించి రాసుకొచ్చారు. 'ఆఁ ఏమవుతుందిలే' అన్న రచనలో.

సినీనటీమణులెందరో పెళ్ళైనవాళ్ళని భర్తగా పొందగాలేంది రంగస్థల నటివైన నీకు మటుకు ఏమైంది? అన్న అనిరుధ్‌కు తగిన శాస్తి చేసిన రంగస్థల కళాకారిణి సౌగంధిక కథే 'సౌగంధికా స్వప్నం'. ఈ కథ వంశీ ఇంటర్నేషనల్‌వారు ప్రచురించిన 'కొత్తకథలు'లో ప్రచురింపబడింది.

కొందరికి పనివాళ్ళంటే గిట్టదు. చాలా చిన్నచూపు. వారింట్లో వారెవరైనా జాలి చూపించినా సహించలేరు. ఏదో ఒక నెపం మీద బయటకు పంపించే ప్రయత్నం గావిస్తారు.

'మళ్ళీ కథ మొదలయింది' అన్న కథలో మానవత్వంతో ఆలోచించే మధుకర్, మల్లన్న కుటుంబానికి సాయం చేయాలని నిర్ణయించడంతో కథ ముగిసింది.

ప్రతి కథలోనూ, మంచితనానికీ, మానవత్వానికీ ప్రాముఖ్యం ఇచ్చారు పొత్తూరి సుబ్బారావుగారు.

ఇటువంటి వ్యాసాలే ఈనాటి సమాజానికి కావలసివుంది.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

# నల్లమల సానువుల్లో గాంధీ గారి ప్రస్థానం



- సుధామ
98492 97958

డా॥ కురుమేటి కిశోర్ కుమార్ గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. 25-04-1970న జన్మించిన ఆయన దంత వైద్యవిద్యతో పాటు విజ్ఞానశాస్త్రం, కళలు, సాంకేతిక విద్య, మేనేజ్‌మెంట్ వంటి విభిన్న రంగాల్లో విద్యాభ్యాసం చేశారు. ఆయన తండ్రి డా. కురుమేటి రామశర్మ , తల్లి శ్రీమతి భార తమ్మగారు. వృత్తిరీత్యా దంత వైద్యుడిగా నంద్యాలలో సేవలందిస్తూనే సాహిత్య, సామా జిక, విద్యా రంగాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారు.

ఆయన విద్యాభ్యాసంలో B.D.S., B.Sc., M.A.తో పాటు ఇతర సాంకేతిక, మేనేజ్‌మెంట్ విద్యార్హతలు ఉన్నాయి. Dayalbagh Educational Institute, Agra నుంచి 2024లో ఆన్‌లైన్ విధానంలో M.A. పట్టా పొందారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్య సించిన ఆయన వైద్యవృత్తిని కొనసాగిస్తూనే రచనా వ్యాసంగంపై ఆసక్తిని పెంచుకున్నారు.

కిశోర్ కుమార్ గారి రచనా ప్రస్థానంలో **'ఔకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల'** (2009), 'నల్లమల నంది వర్ధనాలు (2015), **'ఔకు సీమ సంగ్రహ చరిత్ర** (2021) వంటి ముద్రిత గ్రంథాలు **"కురుమవేటి కవితలు'**, 'నందివలయు పద్యాలు' వంటి రచనలు ఉన్నాయి. సాహిత్య రంగంలో ఆయనకు పలు పురస్కారాలు, ప్రశంసలు లభించాయి. **'ఊర పిచ్చుక'** కథకు అలనాటి అరసం వారి నంద్యాల ప్రాంతీయ విశిష్ట బహుమతి (2013), కర్నూలు సాహితీ సమితి పురస్కారం (2016), గురజాడ ఫౌండేషన్ జాతీయ పురస్కారం (2017), కర్నూలు తెలుగు కళా సమితి వారి తెలుగు ప్రతిభా పురస్కారం (2022) వంటి గౌరవాలు అందుకున్నారు. అలాగే నంద్యాల లయన్స్ క్లబ్ వారి తెలుగు భాషా దినోత్సవ పురస్కారం (2025), మంజుల కళా నిలయం వారి కర్నూలు ఉగాది కవితల పోటీ లో 'నల్లమల పులి కవితకు ప్రశంసా పురస్కారం (2026), శ్రీ కాశీభట్ల వేణుగోపాల్ గారి స్మారక సాహితీ పురస్కారం (2026) వంటి గౌరవాలు కూడా పొందారు.







ప్రతులకు: డా॥కురుమేటి కిశోర్ కుమార్
సెల్:9440244340

వారి సరికొత్త పుస్తకం నల్లమల సానువుల్లో గాంధీ గారి ప్రస్థానం అక్టోబర్ 4 న నంద్యాలలో ఆవిష్కృతమైంది

డా॥ కురుమేటి కిశోర్‌కుమార్ రచించిన ఈ **"నల్లమల సానువుల్లో గాంధీ గారి ప్రస్థానం-స్వరాజ్య సమరంలో నంద్యాల"** పుస్తకం ఒక ప్రాంతీయ చరిత్రను స్వాతంత్ర్యోద్యమ చరిత్రతో అనుసంధానించిన విలువైన పరిశోధనా రచన.

నంద్యాల ప్రాంతపు పౌరాణిక నేపథ్యం, నందుల చరిత్ర, నందికనుమ, నంద్యాల కోటపేట, ఆలయాలు, చెరువులు, వ్యవసాయ వాణిజ్య వికాసం వంటి అంశాలను పరిచయం చేస్తూ రచయిత పుస్తకానికి బలమైన చారిత్రక పునాదిని నిర్మించారు. అనంతరం బ్రిటిష్ పాలన, స్థానిక రాజకీయ-సామాజిక పరిస్థితులు, స్వరాజ్యోద్యమ ప్రభావం, గాంధీజీ పర్యటనలు, స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల పాత్రలను ఆధారాలతో వివరించారు.

ముఖ్యంగా 1929 మే 18న చాగలమర్రి పర్యటన, అక్కడ గాంధీజీ చేసిన ఖద్దరు, మద్యపాన నిషేధం, జాతీయ జీవనంపై ప్రసంగం, ప్రజల స్పందన, స్థానికుల విరాళాలు, గాంధీజీతో ముడిపడిన రామలింగారెడ్డి వంటి వ్యక్తుల జీవిత విశేషాలు పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణ. పాత పత్రికా కథనాలు, గోడపత్రికలు, చారిత్రక ఆధారాలు, చిత్రాలు, సూచికలు, గ్రంథసూచి ఉపయోగించడం రచనకు డాక్యుమెంటరీ విలువను పెంచాయి. పుస్తకం చివరలో విస్తృతమైన ఆధారగ్రంథాల జాబితా కూడా కనిపిస్తుంది.

స్థానిక చరిత్రను కేవలం గతస్మృతిగా కాకుండా స్వరాజ్య స్ఫూర్తి, గాంధేయ విలువలు, త్యాగధనుల చరిత్రగా పరిచయం చేయడం ఈ గ్రంథం ప్రత్యేకత. కొన్నిచోట్ల వివరాల విస్తృతి పఠన వేగాన్ని తగ్గించినా, నంద్యాల నల్లమల ప్రాంత చరిత్రను భవిష్యత్ తరాలకు భద్రపరిచే ప్రయత్నంగా ఈ పుస్తకం ప్రశంసనీయం.

తప్పక చదవదగిన ఉత్తమ రచన. రచయితకు అభినందనలు



పుస్తక సమీక్షలు

# అక్షరం ఆయుధమైతే ఎలా వుంటుందో తెలియజేసే 'అతుకుల గుడిసె'

'అతుకుల గుడిసె' నవలతో, అక్షరం ఆయుధంగా కుంచెను కలంగా కళాకారుడైన **'సురేష్ మందల'** సృజించిన జీవన వేదన చదువరుల హృదయాలను కదిలించి ఆలోచింప చేస్తోంది. **"సార్.. రక్షించండి మా ఊరిలో దళితులను హింసిస్తున్నారు''** అనే వాక్యంతో అయిపోయిన ఈ కథనం, జయంతి ప్రచురణ సంస్థ వారి నవలగా పూర్తి అయింది కాని, నవలా రచయిత సురేష్, మాటలలో **'ఆ సీకటి గుడిసెలో గాలికి అలలెక్కన వూగుతున్న దీపం యెలుతురు'** తన తరాల దళిత జీవన విషాద నీడలతో కొట్టు మిట్టాడుతోంది. ప్రస్తుత 21 శతాబ్దంలో సాంకేతికత ప్రజ్వరిల్లుతున్న డిజిటల్ సమాజంలో, అణగారిన దళిత, బడుగు నిస్సహాయ వర్గాల బతుకులు అనుభవిస్తున్న హింసాద్వేషాలు, కుల వివక్ష **'అతుకుల గుడిసె'** అనే శీర్షిక ధ్వనింప చేస్తోంది.

మన దేశ స్వాతంత్ర్యోద్యమ కాలంలో, ఉన్నవ లక్ష్మీ నారాయణ **'మాలపల్లి'**లో అంటరాని తనం, భూస్వాముల దోపిడీ ఎదుర్కొంటున్న నిరుపేద దళితుల శాంతియుత తిరుగుబాటుకు పిలుపు ఇస్తుంది. దళితులు, పేదల వేదనాయుత జీవన సంఘర్షణ ప్రతిబింబించిన, 762 పేజీల నవలా ఇతివృత్తం అది. 1920, ఈ వందేళ్లలో, మన సమాజం పేదల కన్నీరు తుడిచే అణచివేత, అన్యాయ, అసమానతలు, కుల వివక్ష, సామాజిక న్యాయం సాధించే సంఘర్షణలు, పోరాటాలతో జాతి ఉత్తేజకమైంది. నవ భారత రాజ్యాంగ నిర్మాతగా, హిందూ మత చాతుర్వర్ణ వ్యవస్థను, గాంధీజీతో విభేధించి, బాబా సాహెబ్ డా॥బి.ఆర్. అంబేద్కర్, చీల్చి చెండాడారు. కుల, వ్యవస్థపై అవిశ్రాంతంగా, కొరడా ఝుళిపించిన సామాజిక విప్లవ చరిత్ర ఎంతో తెలుగులో వివిధ సాహితీ ప్రక్రియలలో వెలుగు చూసింది. స్వాతంత్ర్యానంతరం 1948లో పొట్టి శ్రీరాములు కఠోర ఉపవాస దీక్ష ఫలితంగా దళిత సంక్షేమానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చట్టాలు, చర్యలు కొంత సత్ఫలితం అందిస్తున్నాయి.





ప్రతులకు:
సురేష్ మందల
13-6-250/3/12/10
మొదటి అంతస్తు, హరిదాసు నగర్, జఫర్‌గూడ, కర్వాన్, గాంధీమోడల్‌స్కూల్ దగ్గర
హైదరాబాద్500 006
సెల్: 99662 44674

జాతినేతల స్వేచ్ఛ, సమానత, సామాజిక న్యాయం ప్రతిపదికన సామ్యవాద, లౌకిక రాజ్యాంగ వ్యవస్థ భారతదేశ ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసింది.

'అతుకుల గుడిసె', నవ యువ రచయిత, సురేష్ మందల బడుగు వర్గాలు, దళితులు అనుభవిస్తున్న జీవన వేదనకు నవలగా అక్షర రూపం కావటంతో, ఎంత వాస్తవికత ప్రతిబింబింప చేసినా కాల్పనికత తప్పలేదు. చిత్రకారుడు నవలాకారుడు కావటం, తెలుగు సాహిత్యంలో అరుదైన సద్విషయం. అడవి బాపిరాజు, బాపు వంటి వారు సాఫల్యత సాధించారు. 'అతుకుల గుడిసె' నవలా రచయిత, యుగాల నాటి సామాజిక దుష్టత్వం, తుడిచేయాలని జాతి మేధావులు ప్రయత్నించినా చెరగని చరిత్రను ఇతివృత్తంగా స్వీకరించటం అభినందనీయం. 110 పేజీల ఈ నవలలో కులవరక్కసి సృష్టిస్తున్న ఘోరాలు, నేరాలు అగ్రకులాల అణచివేతకు ఇప్పటికీ మానవతా విలువలు మంటకలుస్తున్న కథనం నడిపించారు. డా॥ అంబేద్కర్, మనిషిని కులం ఆధారంగా కాకుండా మనిషిగా చూడాలని తపించారు. చదువు కేవలం అక్షర జ్ఞానం కాదని, అది దళిత ఆత్మగౌరవానికి చిరునామాగా, అణచివేతను పేదరికాన్ని జయించే మార్గంగా, పోరాటం సాగించారు. అతుకుల గుడిసెలో కథా నాయకుడు రాముడు' పాత్రను రచయిత సురేష్, అంతే కసితో అద్భుతంగా చిత్రీకరించారు. స్మశానంలో శవాల మంటల వెలుగులో చదువుకునే సన్నివేశం కూడా ఆవిష్కరించారు. రచయితగా "సురేష్ మందల'', ప్రగాఢంగా వాంఛించే మార్పు అది. చదువు నవలాంతంతో రాముడు కలెక్టర్ కావటం, కుల విద్వేషం సృష్టించిన క్రూరత్వాన్ని, చట్టాన్ని చేతులలోకి తీసుకొని రాక్షసత్వం నుండి మనుసుల్లా మారమని కోరడం, అతుకుల గుడిసె ఉన్న చోటను పేద పిల్లలకు దారి చూపే సెదువుల దేవాలయం సేయాలను కోవటం విద్యాధికులైన ఉన్నత ఉద్యోగ, ఉపాధి బాధ్యతలలో వున్న దళిత మేధావులు చేపట్టవలసిన రక్షణ కర్తవ్యం. పరోక్ష అన్యోపదేశంగా, నవలా రచయిత, సూచించారు.

అతుకుల గుడిసె, ఉబుసుపోక కోసం చదువుకొనే నవల కాదు. సామాజిక ప్రయోజనం ఆశించే రచయిత, హనుమంతు పాత్ర ద్వారా **"యాద సూసినా గుడిసెంత అతుకులు''** అట్లే అతికిన మా బతుకులు ఇంకా యెప్పటి కొరకు" అనిపించటం ఈ నవల అంతరార్థాన్ని తెలియ చేస్తోంది. నవలా నేపథ్యంలో అణచివేత, ఆదివత్య వర్గాల పోరాటం సృష్టించటంలో ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వచ్చింది. గాలివాన, వరద భీబత్సంలో నిరుపేదల నిస్సహాయ దైన్య స్థితి గతులు, రచయిత కళ్ళకు కట్టించారు.

కాని అతుకుల గుడిసె అంటే, తాటాకుల గుడిసె కాదన్నట్టు, ఎందుకో సిమెంటు సెంచులు అతుకులు వచ్చాయి. **"వొగ కిరసనాయులు దీవం గాలికి వూగుతుండాది"** అన్న రచయిత 'ఆ గుడిసెలో ఆ రాత్రి కరెంటు గూడ లేదనే ప్రస్తావన వాక్యం, అప్రస్తుతంగా అనిపిస్తోంది. అదే విధంగా రాము, తనతో చదువు కొనే సరస్వతికి, తన చిన్నప్పటి బాధలను చెప్పే ఫ్లాష్‌బ్యాక్‌కు 1975, తండ్రి పోయేముందు సివరిగా గత కథనానికి 1965 సంవత్సరం పేర్కొవటం, కథా కాల వ్యతిరిక్తత సూచిస్తోంది. ఈ నవల దుష్ట భూస్వామ్య వ్యవస్థ యధేచ్ఛగా, క్రూరంగా, నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న కాలం నాటిదిగా ఉండాలి. స్వాతంత్ర్యానంతరం సంజీవయ్య లేదా మృగరాజు వంటి పాత్రలు వారి స్వరూప, స్వభావాలు వేష భాషలు మారిపోయాయి. సాయుధ పోరాటం తల ఎత్తిన పరిస్థితులను, రచయిత సామాజిక తిరుగుబాటుగా గ్రహించి వుంటే ఇంకా నవలకు పరిపూర్ణత కలిగి వుండేది.

తొలి రచనలోనే సురేష్, దళిత చైతన్యాన్ని తట్టి లేపారు. కాళోజీ బాటలో యాస బాసలోనే బతుకు చూపించారు. **"మన రాతలు మనవే రాసుకోవాల్ల! మన్లో మనువే వొక్కటిగా ఉండలేక పోతున్నాం. అలాంటప్పుడు యెట్లా బాగుపడుతాము"**

ముందుగా మనం మారాలి అది దళిత ఐక్యతా సందేశం. అన్యాయం యెక్కడ జరిగితే ఆటాకి పోయి వాళ్ళను సంపే సిన్నయ్యను శివయ్య స్వామిగా నవలలో చిత్రించబడినా, అడవిలో అన్న నీడ కనిపిస్తుంది.

చివరగా అతుకుల గుడిసెను, విద్యాలయంగా రూపొందింప చేసిన దళిత యువకుని జీవన కథనం, దక్షిణ వీధిలో ఉదయించిన వెలుగు రేకలా అక్షర దీప్తి ప్రసరింప చేస్తోంది.



జయసూర్య
సెల్:9440664610



## మన జీవన సౌందర్యం బతుకమ్మ



ప్రకృతిలో ప్రకృతితో ప్రకృతిని పూజించే
అద్భుత పండుగ బతుకమ్మ...
చితికిన బతుకుల బ్రతుకు పాట బతుకమ్మ...
శ్రమైక జీవన సౌదర్యం బతుకమ్మ...
అలిసిన మనసుల ఆటవిడుపు బతుకమ్మ..
సాధక బాధకాలు సాటి వారితో పంచుకుని
మనసు తేలిక పరుచు కునే వేదిక బతుకమ్మ..
అనందాన్ని ఆవేదనను ఆట పాటలతో తెలిపే
తెలంగాణ బ్రతుకు సిత్రం బతుకమ్మ...
మన అస్తిత్వ జాడ సాంస్కృతిక వైభవం
బతుకమ్మ...
నారి శక్తికి
స్త్రీ ఆత్మ విశ్వాసానికి ప్రతీకబతుక్కమ్మ...
పుట్టింట్లో ఆడపిల్లల ప్రాముఖ్యత బతుకమ్మ..
తీరొక్కపులు ఒకే చోటచేరి ఆడే
ఆనందాల హేల బతుకమ్మ...
ఏ రంగు గొప్పా అంటే ...
అన్నీ రంగులూ నావే అంటూ ..ప్రకృతి లోని
ప్రతీ రంగు ప్రత్యేక మైందంటూ అన్నీ వర్ణాలను కలిపే సమైక్యతా
రాగం ..సబ్బండ వర్ణాల సజీవ రాగమాలిక బతుకమ్మ ...
సున్నితంగా(శ్రద్ధగా ఓర్పుతో నేర్పుతో రంగు రంగుల పూలతో రాశిగా పేర్చి
శిఖరాగ్రాన పసుపు గౌరిని పెట్టిబతుకమ్మను తొమ్మిది రోజులు పూజించి
పసుపు కుంకుమలు ప్రసాదాలు వాయినాలిచ్చి పుచ్చుకుని
ఒడిబియ్యం గట్టి ఇంటి అడబిడ్డగా భావించి ఇట్లనే మళ్ళి రావమ్మా అంటూ
గంగమ్మ ఒడిలోకి చేర్చుట.. ప్రకృతి ప్రకృతిని ప్రకృతిలో కలుపుట
ఎంత తాత్వికత..మన
బతుకు చిత్రం జీవిత సారం బతుకమ్మ .

-శైలజ రాంపల్లి
హైదరాబాద్.

## దండాలమ్మ బంగారు తల్లి ఓ బతుకమ్మ



దండాలమ్మ దండాలమ్మ
బంగారు తల్లి ఓ బతుకమ్మ
నీ అండా దండా ఉండాలమ్మ
కొండంత భక్తితో కొలిచేమమ్మ
తెలంగాణ వాసివమ్మ
రతనాలరాశివమ్మ
కోవెలలెరుగని దేవతవమ్మా
మా మాదినే కోవెల కట్టేమమ్మ
పూలతో పూజలు చేసేమమ్మ
ఆ పూలనే దేవి గా నిలిపేమమ్మా
పెత్తరామాస్య నాడు పేర్చెదమమ్మ
సద్దుల నిచ్చి సాగనంపేమమ్మ
పెద్దమ్మ తల్లివి నీవేనమ్మా
పెద్ద మనసుతో దీవించవమ్మా.
పసుపు గౌరమ్మవు నీవేనమ్మా
పసుపు కుంకుమలు కాపాడమ్మా
బోనాలందుకో భాగ్యమ్మ తల్లీ
సౌభాగ్యమియ్యవే మైసమ్మ తల్లీ
పల్లెపల్లెలోనూ నీ పాటలే తల్లీ
ఊరుఊరంతా నీ ఆటలే నమ్మా.
పిల్లాపాపలను కరుణించవమ్మా
చిన్నాపెద్దను దీవించవమ్మా
నీనోము నీకిస్తా గౌరమ్మ తల్లీ
నీనోము ఫలమియ్యి బతుకమ్మ తల్లీ
విజయములనిచ్చే విజయమ్మ తల్లీ
సంబురాలిచ్చే
బంగారు తల్లీ ఓ బతుకమ్మ
తల్లీ మా బంగారు తల్లీ.

-రాజ్యశ్రీ పొత్తూరి

## బతుకమ్మా.. ఓ బతుకమ్మా..

"పువ్వుల్లో ప్రాణమై..
తెలంగాణ ప్రణవమై!"
బతుకమ్మా.. ఓ బతుకమ్మా..
బతుకులన్నీ పూలుగా పేర్చిన బతుకమ్మా!
నేల నుదుట తంగేడు తిలకమై,
నింగి ఒడిలో గునుగు గీతమై,
మట్టి మమతకు రంగులద్దిన
మహిళా శక్తి మంగళహారమై!
పువ్వు పువ్వునా ఒక కథమ్మా,
రెక్క రెక్కలో ఒక వ్యథమ్మా,
కన్నీటిని కూడా కాంతిగా మార్చే
కలల తెలంగాణకు నీవే నాందమ్మా!
చెరువు అలలకు చీర కట్టి,
చెలిమి చేతులకు గాజులట్టి,
చుక్కలన్నీ నేలకు దిగి
చుట్టూ చేరిన సంబరమట్టి!
బతుకమ్మా.. నీవు పూల గోపురం కాదు,
బతుకు నేర్పిన బడిపంతులివి!
నీవు పండుగలోని పూల జాతర కాదు,
పదిమందిని కలిపే ప్రేమ మంత్రమివి!
ఒక్కో పువ్వు ఒక్కో ఆడపడుచు,
ఒక్కో రంగు ఒక్కో ఆశల వెలుగు,
కులమతాల గోడలు కరిగిపోయే వేళ,
కలిసిన మనసులే తెలంగాణకు బలము!
తంగేడు పువ్వు తలెత్తి చెబుతుంది,
"తలవంచని తత్వమే నా తెలంగాణ!"
గునుగు పువ్వు గర్వంగా పాడుతుంది,
"గుండెల్లోని ధైర్యమే
నా ఆడబిడ్డల ఆభరణం!"
అమ్మ చేతిలో పూల తాంబాళం,
అక్క కళ్లలో ఆనంద దీపం,
చెల్లి అడుగుల్లో జానపద నాట్యం,
అవ్వ పాటలో తరతరాల జ్ఞాపకం!
ఆడపిల్ల అడుగంటే ఆనందం కావాలి,
ఆమె బతుకంటే భద్రత కావాలి,
ఆమె కలలకు ఆకాశం కావాలి,
ఆమె విజయానికి ప్రపంచం జేజేలు పలకాలి!
ఇదే బతుకమ్మ ఇచ్చే సందేశం,
ఇదే స్త్రీశక్తి చాటే సాహసం,
పూలతో పూజించే ప్రకృతి మాతకు,
ప్రేమతో పరిరక్షణే నిజమైన నివేదనం!
చెరువులో కలిసే పూలు చెబుతాయి,
చెదిరినా సువాసనలు మిగులుతాయని!
కాలంలో కరిగే రంగులు చెబుతాయి,
కానీ సంస్కృతి తరతరాలకు నిలుస్తుందని!
ఓ బతుకమ్మా..
నీ చుట్టూ తిరిగేది మా అడుగులే కాదు,
నీ చుట్టూ తిరిగేది మా చరిత్ర!
నీ పాటలో వినిపించేది మా గొంతే కాదు,
నీ పాటలో పలికేది మా అస్తిత్వం!
పూలతో మొదలైన ఈ పండుగ,
ప్రపంచానికి చాటాలి మన సంస్కృతి వైభవం!
బతుకమ్మా.. నీవు తెలంగాణ పేరు కాదు,
తెలంగాణ తల్లి గుండెలో కొలువైన
జీవన నినాదం!
బతుకమ్మా.. బతుకమ్మా?..
బతుకులకు వెలుగమ్మా!
పూలలో పుట్టిన పవిత్రతవమ్మా,
తెలంగాణ ఆత్మకు చిరునామావమ్మా!
జై బతుకమ్మ! జై తెలంగాణ!



-నాగదీప్తి
9119969115

## దుర్గామాతా

విజయాలు చేకూర్చి
శ్రీవిజయ దుర్గా
శరణ్ నవరాత్రుల విజయదశమి
మా పూజలందుకోవమ్మా
తారలే దిగి వచ్చి కోవెలలో దివ్వెలై వెలిగి
పుడమిలో పూలన్నీ మణిహారములై
నొసట చంద్రుని వెలుగులే కుంకుమరేఖలై
వజ్ర వైఢూర్య మణి మాణిక్య గోమేధికాలే
చేతికి బంగారు గాజులై
మిలమిల మెరిసెను బంగారు తల్లి
కోటి సూర్యకాంతులతో దేదీప్యమానంగా
వెలిగేటి ఆ తల్లి సుందరం వర్ణించగలమా
డమ డమ డమ డమ డంకానాదం
గణ గణ గంటలే వేసెను తాళం
శైలపుత్రి శివపత్ని సింహవాహిని
చేసెను ఆనంద తాండవం



-రమాదేవి వాడాడ
8501945424

## సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త:
**సుధామ**
సెల్:9849297958

అందుతోంది
పొందుతోంది
నేటి యువతకు
ప్రకృతితో
కడువిజ్ఞానం
చెందుతోంది.
-వనజా రవిచంద్ర రావు,
హైదరాబాద్.

అరసం
విరసం
అభ్యుదయానికి
ఏదయినా
పెద్దపీట వేస్తేనే
సరసం
-పాటిబండ్ల కవిత
విజయవాడ

మంచి
పంచి
బయటకు
వెళ్లినప్పుడు
చేతిలో ఉండాలి
సంచి !
-మన్నవ సుధాకర్
విజయవాడ

బుసబుసలు
రుసరుసలు
అధికారపక్షం
కూర్చోబెట్టి
ఉచితాలిచ్చినా
ఒకటే గుసగుసలు.
-శ్రీ పెరంబుదూరు నారాయణ రావు
హైదరాబాద్.

భారం
సారం
ఇతరుల
గుణగణాలను బట్టి
ఉంచాలి
దూరం!
-డా॥ గన్నోజు శ్రీనివాసాచారి
మహబూబ్ నగర్

హద్దు
ముద్దు
సప్తపది కవిత్వం
ప్రక్రియలో
వేరేవి
పంపవొద్దు
-వి. సుబ్బారావు
విశాఖపట్టణం

అప్పు
తప్పు
ఇతరులతో
భేషజాలకు పోయి
జీవించడం
ముప్పు
-హైమ. కందుకూరి
లండన్

తంగేడుపూలు
గునుగుపూలు
ఆడబిడ్డల
ఇంటింటికి చేరుతున్న
బతుకమ్మ
పూలు.
-తేజ గుడికందుల
వరంగల్

తీరము
దూరము
చిన్ననాటి
రోజులిక
రావని
మనసుభారము
-విజయకుమారి ముదిగొండ
విజయవాడ

కావాలి
రావాలి
ప్రజాసంక్షేమమే
లక్ష్యంగా
ప్రభుత పథకాలు
తేవాలి
-శ్రీవాణి
తెనాలి

# మంచి పుస్తకాలు జీవితాలను ప్రభావితం చేస్తాయి-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

## ఫిజిక్స్ అరుణ్ జీరో గ్రావిటీ-కవిత్వం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రివర్యులు కిషన్ రెడ్డి, కవి, రచయిత ఫిజిక్స్ అరుణ్ కుమార్, కోటగిరి రాజేష్ కుమార్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్, కొంజర్ల శ్రీనివాస్ బిజెపి టీచర్స్ స్టేట్ కన్వీనర్, అన్నెబోయిన నారాయణ గౌడ్, శ్యాంసుందర్ గౌడ్ తదితరులు.

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రైవేట్ టీచింగ్ ఫ్యాకల్టీ, ప్రముఖ వర్తమాన కవి, రచయిత ఫిజిక్స్ అరుణ్ కుమార్ మూడో పుస్తకం జీరో గ్రావిటీ-కవిత్వం ను గాంధీ జయంతి అక్టోబర్ 2, 2026 శుక్రవారం రాత్రి హైదరాబాద్ లోని బర్కత్ పుర లోని తన క్యాంపు కార్యాలయంలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రివర్యులు కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ అరుణ్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో బోధనా అనుభవంతో, జాతీయత మానవతా శాస్త్రీయ పర్యావరణ సామాజిక స్పృహతో మన దేశ సంస్కృతి, సాంప్రదాయాల ఔన్నత్యాన్ని తెలియజేసేలా ప్రపంచ గతిని మార్చిన మహానుభావుల జీవితాలను నేటి తరానికి తెలిసేలా ఎడిటోరియల్ వ్యాసాలు కవితలు కథలుగా ప్రముఖ పత్రికల్లో తన రచనలు ప్రచురించబడ్డాయనీ, పత్రికల్లో ప్రచురించిన ఆ రచనల నుంచే గతంలో శూన్యం-కవిత్వం, బిగ్ బ్యాంగ్-వ్యాసాలు పుస్తకాలు తీసుకొచ్చాననీ, ఆ పుస్తకాలు సైతం వివిధ రంగాల ప్రముఖుల, మీడియా ప్రశంసలు పొందాయనీ, వివేకానంద, గాంధీజీ, ఠాగూర్, శ్రీనివాస రామానుజన్, సివి రామన్, నేతాజీ, భగత్ సింగ్, విక్రమ్ సారాభాయ్, కల్పనా చావ్లా,అబ్దుల్ కలాం, ఐన్ స్టీన్, క్యూరీ వంటి మహానుభావుల స్ఫూర్తితో ముందుకు వెళుతున్నాననీ కిషన్ రెడ్డి గారికి తెలిపారు.

ఈ సందర్భంగా తన మూడు పుస్తకాలను వారికి ఇచ్చారు. మంత్రివర్యులు కిషన్ రెడ్డి జీరో గ్రావిటీ పుస్తకం గురించి తెలుసుకుంటూ పుస్తకాన్ని వివేకానంద, శ్రీనివాస రామానుజన్ లాంటి మహానుభావులకు అంకితం ఇచ్చినందుకు అరుణ్ ను అభినందించారు. భవిష్యత్తులో అరుణ్ దేశభక్తికి సంబంధించి యువతకు దిక్సూచి లా మంచి ప్రేరణాత్మక రచనలు చేయాలనీ ఆశీర్వదించారు. ప్రపంచ గతిని మార్చిన మహానుభావుల జీవితాలు పుస్తకాల నుండి ప్రేరణ పొందాయని, మంచి పుస్తకాలు మనకు శాశ్వత మిత్రులతో సమానమని, అవసరం మేరకు సోషల్ మీడియాను వాడుకొని పుస్తక పఠనంపై దృష్టి సారించాలని నేటి యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటగిరి రాజేష్ కుమార్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్, కొంజర్ల శ్రీనివాస్ బిజెపి టీచర్స్ స్టేట్ కన్వీనర్, అన్నెబోయిన నారాయణ గౌడ్, శ్యాంసుందర్ గౌడ్, భరత్ గౌడ్, నందనం దివాకర్, వీరెల్లి చంద్రశేఖర్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంస్కారాన్ని నేర్పేవి కథలు- డా.దాసరి వెంకట రమణ




డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ రచించిన 'కథాంజలి' ఆవిష్కరణలో గంటా మనోహర్ రెడ్డి, డా॥ దాసరి వెంకటరమణ, రచయిత వైరాగ్యం ప్రభాకర్, వంశీ రామరాజు, కె. గోవర్ధన్‌రాజు.

హైదరాబాద్, అక్టోబర్ 14:(నేటినిజం ప్రతినిధి): విద్య బ్రతకడానికి కావలసిన జీవనభృతిని సంపాదించే మార్గాన్ని సూచిస్తే కథలు మంచి సంస్కారాన్ని నేర్పుతాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సంగీత కళా నాట్య వేదిక త్యాగరాయగాన సభలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభకు హాజరై కవి, రచయిత విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన కథాంజలి కథా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలు మనిషిలో మార్పుకు దోహదపడతాయని, నవలలకన్న కథలు రాయడం చాలా కష్టమని అన్నారు. చెప్పదలచుకున్న విషయాన్ని సమగ్రంగా సంక్షిప్తకరించి చెప్పడం అంత సులువైంది కాదని అన్నారు.ఆత్మీయ అతిథిగా హాజరైన గంటా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆరుద్ర చెప్పినట్లు ఎన్ని గజాలు రాశామన్నది కాదు, ఎన్ని నిజాలు రాశామన్నది ముఖ్యమని ఈ సంకలనంలోని కథలన్నీ మానవీయ విలువలకు పట్టం కట్టేలా ఉన్నాయని అన్నారు.విశిష్ట అతిథి డా.వంశీ రామరాజు మాట్లాడుతూ భవానీ సాహిత్య వేదిక ద్వారా 150పుస్తకాలు వెలువరించిన ప్రభాకర్ అభినందనీయుడు అన్నారు.ఈ సంకలనంలోని కథలను షార్ట్ ఫిలింస్ గా తీసి పిల్లలకు చూపెడితే చక్కని ఫలితాలు వస్తాయన్నారు. ప్రధాన వక్తగా హాజరైన డా.కాంచనపల్లి గోవర్ధన్ రాజు పుస్తకాన్ని సమీక్షిస్తూ ఏ వాదాలకు చోటు కల్పించకుండా సమాజానికి మంచి సందేశాన్ని అందించేలా కథలు ఉన్నాయని చెప్తూ కొత్తగా రాస్తున్న వారికి అవకాశం ఇస్తూ సాహిత్య సేవ చేస్తున్న వైరాగ్యం ప్రభాకర్ ను అభినందించారు.కార్యక్రమంలో పాల్గొన్న, రచయితలు మొదట కథా పఠనం చేశారు.హాజరైన రచయితలను ఈ సందర్భంగా శాలువా, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు.

## శరభయ్యలో మార్పు (కథ)

వేసవిలో శరభయ్య తన మిత్రునితో కలిసి ఒక గుర్రం బండి మీద పొరు గూరుకు బయలుదేరాడు. దారిలో ఒక వ్యక్తి "ఆపండి, ఆపండి "అంటూ కేకలు వేశాడు. అది చూసి శరభయ్య బండి నడిపే ఆసామితో " బండిని ఆపకు బాబూ! తొం దరగా వెళ్ళు! కొంత మందికి కనబడిన ప్రతి బండిని ఆపి ఎక్కడం అలవాట యింది "అని అన్నాడు. అతను చెప్పిన ప్రకారమే ఆ గుర్రపు బండి వ్యక్తి దానిని ఆపకుండా వేగంగా బండిని పోనిచ్చాడు. బండి కొద్ది దూరం వెళ్ళగానే దాని చక్రం ఒకటి ఊడిపోయింది. అదృష్టవశాత్తు అందులో ఉన్న ముగ్గురికి దెబ్బలు ఏం తగలలేదు. ఆ గుర్రపు బండి ఆసామి వారితో " అయ్యా! మళ్లీ దీన్ని బాగుచేసేంతవరకు మీరు ఆ చెట్టు నీడన విశ్రాంతి తీసుకోండి " అని అన్నాడు. వారు సరేనని ఒక పెద్ద మామిడి చెట్టు నీడ వద్దకు వెళ్లారు. ఆ మామిడి చెట్టు విరగకాసింది. చెట్టు నిండా మామిడి పండ్లను చూసే సరికి శరభయ్యకు నోరూరింది. వెంటనే అతని మిత్రుడు చెట్టుని ఎక్కి కొన్ని పండ్లు తెంపుకొని దిగి శరభయ్యకు కొన్ని పండ్లు ఇచ్చాడు.

శరభయ్య వాటిని తింటుండగా అక్కడికి ఇంతకుముందు బండి ఆపిన వ్యక్తి పరిగెత్తుకొని వచ్చాడు. అతన్ని చూసిన శరభయ్య కోపంతో "మళ్లీ మేము వచ్చిన చోటుకే వచ్చావా! ఇది మా బంధువుల చెట్టు. నీవు ఒక్క పండును కూడా ముట్టడానికి వీలు లేదు "అని అన్నాడు. అప్పుడు ఆ వ్యక్తి ఏమీ మాట్లాడకుండా అక్కడ ఉన్న శరభయ్య సంచీలోని దోసకాయను తీసి నోట్లో పెట్టుకొని కొరికాడు.

అది చూసిన శరభయ్య కోపంతో " ఏయ్! నిన్ను ఆ దోసకాయ ఎవరు ముట్టమన్నారు? దానికి డబ్బు చెల్లించు" అని అన్నాడు. "అయ్యా! నేను దానికి డబ్బు చెల్లిస్తాను. మరి మీరు మామిడి పండ్లకు డబ్బు చెల్లించండి. ఆ పండ్లు ఎవరివని మీరు తింటున్నారు? "అని అన్నాడు ఆ కొత్త వ్యక్తి.

అప్పుడు శరభయ్య "ఈ చెట్టు మా బంధువులది తెలుసా!" అని అన్నాడు. "అలాగైతే నేను మీ బంధువునే అన్న మాట. అందుకే ఈ దోసకాయను తీసుకున్నాను. ఇందులో తప్పేముంది? చెల్లుకు చెల్లు. ఆ మామిడి చెట్టు నాది. దాని పండ్లు నావి. అవి మీరు నన్ను అడగకుండా ఎందుకు తీసుకున్నారు? అది మీ తప్పు కాదా! నేను మీ గుర్రపు బండి చక్రం ఊడిపోతుందని చెబుదామని మీ బండిని ఆపమన్నాను తప్ప దానిని ఎక్కడానికి కాదు. అయినా అపరిచితులకు బండి ఆపలేదంటే అందులో అర్థం ఉంది. నేను, మీరు ఒకే గ్రామానికి చెందినవాళ్ళం. మీకు తెలిసిన వాడి నైన నాకు బండి ఆపకపోవడం ఏమిటి? మీ పద్ధతి ఏం బాగా లేదు. మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు "అని అన్నాడు ఆ కొత్త వ్యక్తి. అది విన్న శరభయ్య తాను అతనిని చూసి అపార్థం చేసుకున్నందుకు చింతించి తనను మన్నించమని చెప్పి మరికొన్ని దోసకాయలను అతనికి ఇచ్చాడు. శరభయ్యలో వచ్చిన మార్పు చూసి ఆ కొత్త వ్యక్తి ఎంతో సంతోషించాడు.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
9908554535

# కౌమార క్రిటిక్కులు – 2




మా మెంటార్ అండ్ మిస్టర్ క్లీన్ ని చూడగానే పెద్దాయనకి కాస్త వణుకు మొదలయింది.

"ఇంక నేను బయలుదేరుతాను" అన్నారాయన.

"ఇప్పుడేగా మొదలైంది. కాసేపు వుండండి. చాయ్, బిస్కెట్స్ తిని వెళుదురు గాని" అన్నాడు మా విదూ.

"అవేవీ అవసరం లేదు. మీ గురువు గారితో మాట్లాడండి, మళ్ళీ కలుస్తాను" అని హడావుడిగా వెళ్తుంటే...

"మాస్టారూ! మీ పుస్తకాలు?" అని అరిచింది అన్య.

"అవి మీకే. సగం పుస్తకాలు నేను వచ్చినప్పుడు తీసుకువెళ్తాను" అని సైకిల్ మీద స్పీడుగా వెళ్ళిపోయారు.

అప్పుడు మా క్లీన్ గారు పుస్తకాల కేసి చూశారు.

"మంచి బేరం తగిలింది అనుకుంటాను" అన్నారు.

"అంటే ఇవన్నీ సెకండ్ హ్యాండ్ షాపులకి అమ్మటానికి ఇచ్చారు అనుకుంటున్నారా?" అన్నాడు విదూ.

"లేదురా, మీరే జ్ఞానాన్ని పొందటానికి బల్క్ గా కొన్నారు అనుకుంటాను. హోమ్ డెలివరీ. కాకపోతే సగం పుస్తకాలు వెనక్కి తీసుకుంటున్నాను అంటున్నారు. అంటే మీకు నచ్చకపోతేనా?"

"అది కాదు బాస్! వీటి మీద మేము సమీక్షలు రాయాలట. ఆయన మమ్మల్ని బాల... అదే, కౌమారపు క్రిటిక్ లుగా తయారు చేస్తారట. ఆయన వుంది పావుగంటే. మాకు గీతోపదేశం చేస్తున్నారు. మిమ్మల్ని చూడగానే గాయబ్! ఇంతకీ వారిని ఇంతకుముందు ఎప్పుడైనా చూసారా?" అన్నాను.

"మనకు తెలియని లిటరరీ ఫిగర్ వుంటుందా? సో... మీరంతా కొత్త అవతారాలు ఎత్తబోతున్నారన్నమాట! ముగ్గురికీ కంగ్రాట్స్. ఇంక నాదో అనుమానం" అన్నారు మా ముగ్గురిని చూస్తూ.

"సెలవివ్వండి" అన్నాను.

"ఇప్పటిదాకా నాకు చాయ్ బిస్కెట్లు ఎప్పుడైనా ఆఫర్ చేశారా? ముందు వచ్చిన చెవుల కంటే వెనక వచ్చిన కొమ్ములు వాడి అంటారు కదా!" అన్నారు.

"తమరు చాయ్, బిస్కెట్లు పుచ్చుకోరని మాకు తెలుసు. ఈరోజు సబ్జెక్ట్ పెద్దది కాబట్టి, మీకు బిర్యానీ ఆఫర్ చేస్తున్నాం. ఏ జంతువుది కావాలి? ప్యూర్ వెజ్జా?" అంది అన్య.

"ఏదో ఒకటి కానీయండి రా" అంటూ మొదలుపెట్టాడు.

"పిల్లలూ! ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రోజుకు కనీసం మూడు పుస్తకాల చొప్పున మార్కెట్లోకి వస్తున్నాయి. అలాగే మూడు నెలలకు ఓ పత్రిక మూతబడుతోంది. ఇప్పుడున్నవి ఆన్లైన్ పత్రికలు, కాసిన్ని మాస పత్రికలు. అలాగే పెద్ద పత్రికల ఆదివారం సంచికలు."

"అదేంటి గురూజీ! ఫేస్బుక్ లో ఏడు సముద్రాలు వున్నాయి. అలాగే ఎన్నెన్ని యాప్ లు, గ్రూపులు, గూగుల్స్, సవాలక్ష బ్లాగులు లేవు? పత్రికలు మూతపడితే ప్రపంచం ఆగిపోతుందా? మీ చాదస్తం గాని" అన్నాడు విదూ.

"వీడేంటిరా మేంగో – మధ్యలో కామెంట్లు? దీన్నే అప్రస్తుత ప్రసంగం అంటారు. అవధానులను డిస్టర్బ్ చేయడానికి ఇలాంటివారిని ఏర్పాటు చేసుకుంటారు" అన్నాడు.

"సాహిత్యం అంటే, కథలంటే, కవిత్వం అంటే, ఇంకోటి అంటే మాటలా? వాటి వెనుక ఎంత శ్రమ, ఎంత దీక్ష, ఎంత అధ్యయనం, ఎన్ని నిద్రపోని రాత్రులు... ఇలా రకరకాల కామెంట్లు చేస్తుంటారు కదా సీనియర్లు! వీరు పత్రికలన్నీ మూతబడుతున్నాయని వాపోతున్నారు క్లీన్ గారు. అందుకని సోషల్ మీడియా ఏడు సముద్రాలంత లోతైనది అని విదూ అంటున్నాడు. ఇందులో మీరు కోపం తెచ్చుకోవాలా?"

"అన్య అంటోంది నిజం. అసలు ఇప్పుడు వేదికల మీద, సమీక్షల్లో, గ్రూపుల్లో... ఒక్కమాటలో ఎందెందు వెతికినా చక్రి కనిపించునో లేదో గాని, అప్రస్తుత ప్రసంగాలు మాత్రమే వినిపిస్తాయి కదా గురూజీ! అందుచేత మీరు వీటన్నింటికీ అతీతంగా వుండాలి. పాయసంలో జీడిపప్పు పలుకుల్లా మధ్యలో మేం ఏదొకటి కామెంట్ చేయకపోతే అందులో మజా ఏముంటుంది?" అన్నాను.

"అసలు చాలామంది ఈ కామెంట్ల మీద, ఇంకొంతమంది ఆ కామెంట్ల మీద కామెంట్ల మీద బతికేస్తున్నారు. మామూలుగా కాదు. మంచి గృహాలు కొంటున్నారు, కార్లు కొంటున్నారు" అంటోంది అన్య.

మిస్టర్ క్లీన్ చేతులు జోడించాడు.

"నన్ను వదిలేయండి పిల్లలూ!" అన్నారు.

"అస్త్ర సన్యాసమా?" అన్నాను.

"అవును రా! మీరు ఇలా ఎడాపెడా వాయిస్తుంటే, మొత్తంగా సన్యాసమే బెటర్ అనిపిస్తుంది. నేను ఇంకా ఈ నగరంలో వుండను... గుడ్ బాయ్!" అని నిష్క్రమించబోయారు.

మేం ముగ్గురం ఒకరు కాళ్ళు, ఇంకొకరు చేతులు, మరొకరు గడ్డం పట్టుకున్నాం.

"ఐదు నిమిషాలు మాట్లాడం, తర్వాత మౌనంగా వుండం... అయినా మీరు భీష్ముడిలా వుంటాననంటే కుదరదు. యు ఆర్ స్టిల్ యంగ్ అండ్ ఎనర్జిటిక్!" అని బతిమాలుకుని కూర్చోబెట్టాం.

"ఓకే... ఇప్పుడు సంవత్సరానికి కొన్ని వందల పుస్తకాలు వస్తున్నాయి. రాగానే, రాకముందు అందరూ వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. అలా చేసినంత మాత్రాన వాటిని ఎవరూ కొనరు. అందులో ఏముందో ఎవరో ఒకరు చెప్పాలి కదా! నాకు తెలిసి ఒకాయన వుండేవాడు.

అతను 'మూడు వేల పుస్తకాలు సమీక్ష చేశాను' అనేవాడు. ఇప్పుడు లేడు. ఆయన పుస్తక సమీక్షలో ఆ గ్రంథం పేరు, ధర, ప్రాప్తి స్థానం, ముందుమాట రాసినవారి నుండి రెండు వాక్యాలు కోట్ చేసేవాడు.

సమీక్ష అయిపోయింది! అలా కొన్ని వేల పుస్తకాలు సమీక్షించవచ్చు ఎవరైనా! ఏమంటారు?"

"సమీక్షల వల్ల పుస్తకాలు అమ్ముడవుతాయి అంటే నేను నమ్మను" అన్నాడు విదూ.

"మరి ఎలా అమ్ముడవుతాయి నాయనా?"

"రకరకాల భంగిమలు, ఫోటోలు, అవసరాన్ని బట్టి ఎక్స్పోజింగ్..."

"మగవాళ్ళు కూడా ఎక్స్పోజ్ చేస్తారా?"

"ఎందుకు చేయరు బాస్! సిక్స్ ప్యాక్, ఎయిట్ ప్యాక్, ఇంకా..."

"విదూ చెబుతున్నది నిజం. ఎక్స్పోజింగ్ ఆడవారే చేయరు. అసలు నాకో డౌట్. 'మాకు మీ రచనలతో పని, మీ రకరకాల భంగిమలు ఎందుకు?' అంటే ఇవి కూడా సమీక్షల్లో భాగమేనా? అంటే ఓ ప్రోడక్ట్ బయటకు వచ్చాక బడ్జెట్ని బట్టి ప్రమోట్ చేస్తుంటారు కదా! ఆవిష్కరణ సభ నుండి అవన్నీ ఇందులో భాగాలా?" అంది అన్య.

"ఇప్పుడు నిజంగానే బిర్యానీ కావాలి.

మనం తిన్నాక మాట్లాడుకుందాం. స్విగ్గీకో బులావ్" అన్నారు మిస్టర్ క్లీన్.

'డోంట్ గో ఎవే!'



– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

---



## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాధ్షా'
పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ
95021 56813



### నీ బలం

ఒంటరితనం చుట్టుకున్నా
ఒదిగిపోకు ఓ విద్యార్థీ,
చీకటి దారిలోనైనా చిగురించాలి నీ కాంతి.
మనసులోని మౌనాన్ని మేలుకొలుపు చదువుతో,
నిరాశల నిశ్శబ్దాన్ని జయించు నీ పట్టుదలతో.
ఎవరూ తోడు లేరని ఎదురు చూపు వద్దు,
నీ గమ్యం నీ ముందుంటే అడుగు ఆపకు నేడు.
పుస్తకమే నీ ఆయుధం, పట్టుదలే నీ బలం,
విజ్ఞానమే నీ కవచం, విజయమే నీ ఫలం.
కన్నీటి వెనుక దాగిన కలలను వెలిగించు,
కష్టాల కడలిలో ధైర్యనౌక నడిపించు.
నిశ్శబ్దంగా సాగేదే నిజమైన ఈ సమరం,
నీ నిన్నటిని మించినదే నేటి నీ విజయం.
ఓటమి మాట వినక, ఆత్మవిశ్వాసం వీడక,
ప్రతి పుటలో కొత్త ఆశను నింపుకుంటూ నడవక.
నీ గెలుపు నీకే కాదు, సమాజానికి వెలుగవ్వాలి,
నిశ్శబ్ద యుద్ధం చివర జ్ఞానజ్యోతి వెలగాలి!

–రాజ్యలక్ష్మి శశిధర్.

### అనుబంధాల బంధీ

అనుబంధాల అల్లికలలో కనిపించని అలజడులు,
ప్రేమల వెనుక దాగివున్న అలసిన కలల దృశ్యాలు.
నవ్వుల పరదా వెనుక నలిగిపోయే బాధ్యతల భారాలు,
పెదవులపై మౌనం పూసినా గుండెల్లో ఎగసే సాగరాలు.

?కోరుకున్న అంచనాల ఎత్తైన పర్వతాల నీడలలో,
కరిగిపోయే స్వంత చిరు ఆశల వెలుగు కిరణాలు.
తీరని నిరీక్షణల లోతుల్లో ఈదే ఒంటరి నౌకలు,
రాలని కన్నీటి చుక్కలతో తడిసే
అంతరంగ హృదయాలు.

ఒక్క అడుగు వెనక్కి పడితే విరిగిపోయే బంధాలు,
మనసు ముక్కలవుతున్నా మోసే
చిరునవ్వుల ముసుగులు.
ఒప్పందాలు లేని త్యాగాల బాటలో సాగే అడుగులు,
భాషలేని గాయాలను మోస్తూ గడిపే సుదీర్ఘ క్షణాలు.

గెలుపుల రంగులు కప్పబడిన
ఓటమి లోతైన జ్ఞాపకాలు,
ఎవరికీ చెప్పలేని వేదనల నిండిన
కాంతిరేఖల లోయలు.
వెలుగును పంచే దివ్వెలా కరిగిపోయే తత్త్వాలు,
జీవితపు చదరంగంలో తమను తాము
మలచుకునే నిజాలు.
కావా ఇది అన్ని మనిషి చేసే నిశ్శబ్ద యుద్ధాలు.

–విజయ కులకర్ణి

### గెలుపుకై ఆరాటం

మూడు ముళ్ళు
వేయించుకుని
ఏడు అడుగులు నడిచి
వైవాహిక బంధంతో
స్థిరపడిన గృహిణికి
తనకంటూ
ఒక ప్రపంచం ఉందా! లేదు?
అలుపెరగక ఇంట
బయట కార్యాలను
సమర్థవంతంగా చేస్తూ
బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి,
సదనంలో
మమతల వెలుగులు
పంచిన ఆమె సహనం
త్యాగం ఎవరు గుర్తించరు?
కనపడని ఆ మాటల
వెనుక, ఆ కన్నీటి చాటున
నిశ్శబ్దయుద్ధ వాతావరణమే ఉంది.
నీకేమీ కావాలి అని
ఎవరు అడగరు?
ఆమె శ్రమను గుర్తించక వెక్కిరిస్తూ,
హేళన చేస్తూ
ఇంట్లో ఉండే దానివి
నీకేం తెలుసు అంటూ
నిత్యం అవమానించే
మగమహారాజులు ఎందరో!
మాటలతో తూట్లు
పొడిచి మనసంతా
గాయపరచి, అనునిత్యం
కన్నీటిధారలలో
ఆమె బ్రతుకు బలి
కావాల్సిందేనా?
గెలుపుకై ఆమె పడే
ఆరాటం ఎప్పుడు
గెలుస్తుందో?
ఎప్పుడు ఆమె శ్రమను
గుర్తించి గౌరవిస్తారో!
నిజంగా ఆరోజు కదా
స్త్రీ మూర్తులు అందరికీ
పర్వదినం.

–రాచర్ల సులోచన
హైదరాబాద్

### మనోగతం..!

అది గతాల తాలూకు
మనో గాయాల నిధికి
ప్రతినిధి...
అది సాధించలేని సాధింపులను
నిక్షిప్తం చేసుకున్న
బాధల ఖాజానా..
అది ఎదిరించలేని
ప్రవర్తన అలవర్చుకొని
అణచుకున్న ఆవేశాల
నిగ్రహపు ఖార్ఖానా..
అది మనో గతపు
తీపి చేదు ప్రవాహాలకు
కవాటాలేర్పరచి వారధిగా నిలిచిన
మూగ ఖైదీ ఉండే జైలు గది..
అది నిశ్శబ్ద విప్లవాలకు
నెలవైన మౌనపు తోటకు
నమ్మకమైన కాపలాదారు..!

–యర్రాబత్తిన మునీంద్ర
నెల్లూరు

### ఆదర్శం

ఆశల వెలుగులను ఇంట నింపారు
అడుగడుగునా అండగా నిలిచారు
కన్నీటి వెనుక నవ్వులు పంచారు
సుఖదుఃఖాలలో తోడుగా నిలిచారు.
ఎన్ని కష్టాలు ఎదురైనా
కలిసే నిలిచారు
కుటుంబం కోసమే
జీవితాన్నే త్యాగం చేసారు
పిల్లల నవ్వుల్లో సంతోషాన్ని చూశారు
వారి ఎదుగుదలే
తమ విజయంగా భావించారు.
నిత్యం ప్రేమానురాగాలతో ఇంటిని నింపారు
నమ్మకాన్ని బంధానికి పునాదిగా చేసుకున్నారు
సహకారంతో ప్రతి అడుగు కలిసి వేశారు
సంసార బంధాన్ని పదిలంగా కాపాడారు.
వారి త్యాగమే ఇంటికి వెలుగైంది
వారి ప్రేమే బంధానికి బలమైంది
వారి జీవితం మనకెంతో ఆదర్శం
వారి బంధం ఎప్పటికీ
చిరస్మరణీయం

–నిమ్మగడ్డ కృష్ణ
+91 81057 12574



### కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

సంపాదకులు

### కన్నీటి కష్టం..!!

కూటి కోసమే ఉన్న ఊరికి కన్న
వారికి దూరంగా వెళ్లక తప్పని పరిస్థితి .
రెక్కల కష్టాన్ని నమ్ముకున్న పేద జీవుల బతుకులు.
అపరిచిత నగరంలో అనాథలైన అమాయక గుండె శబ్దాలు.
ఎక్కడ ఏమి దొరికితే అదే పరమాన్నం.

రోడ్డు పక్కన ఫుట్ పాత్ అయినా అదే
పట్టు పరుపు మంచం.
కన్నవారిని కట్టుకున్నవారిని విడిచి వచ్చిన వలస ప్రాణాలు.
గుండెల్లో దాచుకున్న సొంత ఊరి తీపి జ్ఞాపకాలతో ..
కంటి నిండా కన్నీరుతో వలస బాట పట్టవలసిన స్థితి.

పగలేమో చెమటతో సాగే కఠిన శ్రమల కాలాలు.
రాత్రేమో కడుపు నిండా ఆకలి మంటల బాధలు
రెక్కాడితే గాని డొక్కాడని పేదరికం తెచ్చిన శాపాలు
ఎండనక వాననక కష్టపడే శ్రామిక వీరుల బతుకులు.

ఆశల దీపం వెలిగించడానికి చేసే నిరంతర పోరాటాలు.
ఎవరికీ చెప్పుకోలేని గుండె నిండా దాగున్న ఆవేదనలు
బతుకు బండిని లాగడానికి పడే ఎన్నో తపనలు
చిన్న పిల్లల భవిష్యత్తు కోసం చేసే త్యాగాలు.

సుదూర తీరాలలో ఒంటరిగా మిగిలిన బతుకు చిత్రాలు
కాలం మారినా మారని వలస బతుకుల కష్టాలు
కార్మిక లోకపు కన్నీటి గాథలే ఈ వలస జీవితాలు..!!

–డా. మరుదాడు అహల్యా దేవి
98482 38453

### ఆశాజ్యోతులు అమ్మానాన్నలు..

కష్టాల కడలిలో వారు ఈదులాడినా
సంతోష పరిమళాలనే
పంచి సంసార నావను తీరం చేర్చారు
కడలి లోతు తెలియకుండా మనను పెంచి
కనుల నీరు రానీక కళ్ళల్లో వత్తులు వేసుకొని చూచి
తాము కొవ్వొత్తిలా కరుగుతూ మనకు వెలుగును పంచి
కష్టాలు యిష్టంగా నష్టం లేకుండా వారు యెంచుకొని
చెట్టు సంపదను ఆశించకుండా పంచిన రీతి
నది మధురమైన నీటీని
తాను త్రాగక అందించిన భంగి
గోవులు పాలతో
పసివారి ప్రాణం నిలిపిన భ్రాంతి
అనవరతము కష్టాల కొలిమిలో కరుగుతూ
అహరహం సంతానం సుఖం కోరుకుంటూ
ఉండే ప్రత్యక్ష దైవాలే జన్మనిచ్చిన
తల్లిదండ్రులు వారే మన దేవుళ్ళు
జన్మకి కారణం జనని తొలిగురువు ఆమే
వేలు పట్టుకొని ప్రపంచం చూపి
మంచి చెడులు తెలిపి
బ్రతకటం నేర్పిన మనీషి నాన్న
వారిరువురు తిన్నారో దాచారో మనకు
దారి చూపారు
పెద్దతనంలో మన పిల్లల్లా మనం
చేయిపట్టి నడపుదాం
అనురాగంతో ఆదరణ చూపుదాం
అనుసరిద్దాం వారి అడుగుజాడలు
ఆచరిద్దాం అనువైన అనుసరణీయ
పలుకులు
మన ఆశాజ్యోతులు వారే
ఇదే వారికందించుదాం ఘన నివాళి.

–శ్యామలా దేవి, 78932 29318





## పుస్తక సమీక్ష

# గునుగుపూలు ఉదయశ్రీ ప్రభాకర్ కవితా సంపుటి

"బతుకమ్మ పండగ వస్తే చాలు. చెల్కల పొంటి వరుగులు పెట్టి గునుగుపూలు కోసుకొచ్చి రంగులు అద్ది ఆరబెట్టి చాలా మంది శ్రామికులు సిటీలో అమ్ముతారు. అన్ని పండగ రోజు ల్లో, వారింట్లో ఎలా ఉన్నా, అందరింట్లో ఆనందాల వెలుగులు నింపుతారు. వారి శ్రమ కళ్ళారా చూసాక రాసుకొన్న కవిత "గునుగుపూలు" అంటారు **'గునుగుపూలు'** కవయిత్రి ఉదయశ్రీ ప్రభాకర్.

నిత్యంపూజలో, కానీ తరుణుల తలలో కానీ, చేరని గడ్డి జాతి పూవులు, తెలంగాణా బీడు నేలలలో విరిసే **"గునుగుపూలు అమ్మటం వచ్చే ఒక్కో రూపా యిని కొంగున కట్టి, బతుకమ్మ తెచ్చిన భాగ్యం"** అంటూ మురి సిపోవటం, కవయిత్రి గునుగు పూలను బడుగు జీవుల సంకేతాలుగా, కవితాత్మను కదిలించటం, తన కవితా సంపుటి శీర్షికగా, ఎవరూ పట్టించుకోని ఆ పూలను ప్రేమించటం తెలంగాణ పల్లె సీమల ఆత్మీయ హృద యగతీ స్పర్శకు ప్రతీకగా గౌర వింప చేస్తోంది.






ప్రతులకు:
ఉదయశ్రీ ప్రభాకర్
ఫ్లాట్ నెం.203
హన్మకొండ,
వరంగల్ అర్బన్–506001
సెల్: 9866687134

ఈ సంపుటిలో 51 కవితలలో, ప్రస్తుత సామాజిక వ్యవస్థలోని అన్యాయ, అక్రమ, అత్యాచార దుర్నీతిపై స్పందనలు, వేదనా వ్యక్తీకరణాలు, జీవన అవగాహనలు, స్త్రీ స్వేచ్ఛయుత జీవిత వేదన, పర్యావరణ పరిరక్షణపై హెచ్చ రికలు నిజాయితీగా కవయిత్రి ప్రతిధ్వనింపచేసారు. తన చుట్టూ ఉన్న జీవన అంశాలపై కవయిత్రి, కవితలుగా ప్రాణం పోసారు. దూదిపూల దుఃఖం, గునుగుపూల సంబరం, రైతుల మరణ శాసనం, గీత కార్మిక జీవన చిత్రం, పదునైన కత్తి అంచులపై ఇంటా బయటా మేకవన్నె పులుల నడుమ చిక్కని లేడిలా సాగుతున్న యువతులు, వైవిధ్యభరిత జీవన చిత్రణను అద్భుత కవితా రూపాలలో ప్రదర్శింపచేసారు.

**"గుండెల్లోని వ్యధలను పెదవి దాటనివ్వని స్త్రీ మూర్తు లకు ముద్ద బంతులే ఆదర్శ మేమో"** అంటూ పూబోణి నేస్తం ముద్దబంతి, అతివల చిరునామా ఆత్మీయ పుష్పం అంటారు. తెలంగాణ ఊపిరి కాళోజీ, జోహార్ చాకలి ఐలమ్మ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, ప్రస్తావించారు. చీర సింగారం మౌనంగా మరుగున పడుతోందని, నేడు పండుగలకే పరిమితమవుతోందని, అమ్మతనానికి నిండుతనాన్ని యిచ్చే, చీరకట్టు మాతృభావన, నట్టింట మహా లక్ష్మిలా మురిపిస్తుందంటారు. **'చూపులు చిక్కనీయకు'** కవితలో చేతివృత్తుల తలరాతలు తారు మారైనాయి అంటూ మాల్స్ మాయలకు చిక్కవద్దని హెచ్చరిస్తారు.

'నాన్న' కవితలో

**"ఊహ తెలియని రోజులలో**
**ఊపిరిలో దాచుకొంటూ**
**పాదాలు పుడమిని అంటకుండా**
**అరచేతిలో అడుగు వేయించే ఆనందరూపం నాన్న'**

'గునుగుపూలు' కవితా సంపుటిలో చదువరులను ఆకట్టుకొనే సరళ కవితా శైలితో, పరిణతి చెందిన సహజ భావ సామాజిక, కవితా కాంతి ప్రసరింప చేసిన కవయిత్రి ఉదయశ్రీ ప్రభాకర్ అభినందనీయురాలు.



–జయసూర్య
సెల్: 9440664610



### పల్లెల్లో వలసలు – పట్టణాల్లో జల్సాలు

నీరు పల్లమెరుగు నిజము దేవుడెరుగు
గతుకుల రోడ్లపై నడువ లేక
ఉరిసే గుడిసెలలో ఇమడ లేక
చిమ్మ చీకటిలో బ్రతక లేక
అప్పుల బాధలను తట్టుకోలేక
ఉపాధి కరువైన ఊర్లలో జీవించ లేక
నీరు పల్లమెరిగినట్లే గ్రామీణులు
పట్టణాలకు వలసలు వెళ్తుంటారు .
వలస పక్షుల లాగా మనుషులు
వారి వారి ఉన్నతి కొరకు ఉన్నత జీవనం కోసమో
పరిస్తితుల కారణంగానో
ప్రకృతి పరిహాసం చేయడం వలననో
పల్లె ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి
నిత్యం వలసలు వెలుతూనే ఉంటారు
ఎక్కడి కష్టాలు అక్కడే సహజం!.
దేశానికి వెన్నెముక గ్రామాలన్నారు గాంధీ
అలాంటి గ్రామాలను అభివృద్ధి చేయకుండా
పట్టణాలను అభివృద్ధి చేస్తే ఫలితమేమి
పట్టణాల్లో జల్సాలు పల్లెల్లో వలసలు తప్పా
మరేమి ఉంటుంది తెలియని వింత!.
నాయకులలో స్వార్థం
నేతలలో అవినీతి పెరిగి పోవడం
ఆశ్రిత పక్షపాతం ఉండటం
చట్టాలు ధనికులకు చుట్టాలవడం
పేద తనం పిరికి తనం మొదలైనవి
నేడు వలసలకు కారణాలు!.
పట్టణాలకు వలసలు తగ్గాలంటే
నిస్వార్థంతో నాయకులు, ప్రభుత్వాలు
పట్టణాలతో సమానంగా
పల్లెలను అభివృద్ధి చేయాలి
అభివృద్ధి వికేంద్రీకరణ జరుగాలి
పట్టణ యువతకు వలెనే
ఉన్నత విద్య సాంకేతిక విద్యా
సౌకర్యాలను ఏర్పాటు చేయాలి!
పుట్టిన గడ్డను విడువకు
మట్టి గోడలను మరువకు
చెరువు కట్టకు దూరమవకు
పెంచిన చెట్టును కూల్చకు

–మార్గం కృష్ణ మూర్తి
94418 41314



## కడదాకా వినిపించే సవ్వడి

అనుబంధాల మెట్లపై నిలుచుని
అనునయాల పన్నీరు చల్లి
దిగులు తెరలు తీసి నేనున్నానంటూ
ఆసరా తీగల్ని అల్లించేందుకు
మనసున్న మనిషి వేసే
అచ్చమైన బతుకు
పందిరి అవ్వాలి వాగ్దానం!
గతుకుల దారిలో నడిచే
నిరాశా నిస్పృహ జీవన చక్రాల్ని ఒరగనివ్వక
ఆశల జోడెద్లు పూన్చి, నమ్మకపు కందెన లద్ది
నిజాయితీ పగ్గాల్ని చేపట్టి
ప్రగతి దారుల్లో నిత్యం పయనించే
విశ్వాసపు గంటలా మోగాలి వాగ్దానం!!
స్వలాభాపేక్షతో స్వార్థపు గొంగళ్ళుకప్పి,
ప్రశ్నించే సగటు మనిషి గొంతు నొక్కేసిన
బడా బాబుల్ని నిలువరించే నిఖార్సైన
అస్త్రమై ఆపన్నులను గాచే నాయకుని
అజెండాగా నిలబడాలి వాగ్దానం!!
బాధ్యతల మూటల్ని ఎన్నిమోస్తున్నా
జీవన గమనంలో
లక్ష్య రేఖల్ని పనిగట్టుకుని చెరిపేసేవారెందరున్నా
తీరంలో నిలబడి సుదూర నావికులకు
దిశను చూపే లైట్ హౌస్ లా
నిరంతరం వెలగాలి వాగ్దానం!!
అన్యాయానికి అరదండాలు వేసి
న్యాయం తలపాగాలా చుట్టుకుని
నడిచే దారుల్లో విలువల తివాచీలు పరుస్తూ
గెలుపు ఓటముల వైకుంఠ పాళీ
నిచ్చెన మెట్లు ఎక్కి దిగుతున్నా
నిలబెడతానన్న కర్తవ్యపు జెండా నిలిపేవరకూ శ్వాస పిట్టల
రెక్కల్లో కడదాకా వినిపించే సవ్వడి కావాలి వాగ్దానం!!

**-అమృతవల్లి అవధానం**
9052912120.

## నీటి మీద రాతలు

వాగ్దానం అంటే ఒక విత్తనం...
చేతిలో కాదు, గుండెలో నాటాలి....
నీళ్ల పోయకపోతే ఎండిపోతుంది...
నమ్మకం లేకపోతే కుళ్లిపోతుంది!.
నాన్న నా చిన్నప్పుడు చెప్పాడు....
ఆకాశంలో నక్షత్రం తెస్తానని....
నేను ఆకాశం వైపు
చూస్తూ నిద్రపోయాను...
తెల్లారి చూస్తే నాన్న చేతిలో
రాత్రంతా కుట్టిన నా చిరిగిన చొక్కా!.
అమ్మ దీపం ముందు అంది....
నువ్వు బాగా చదివితే చాలు అని....
నేను చదివాను,..
అమ్మ దీపం
ఇంకా నూనె లేకుండా
వెలుగుతూనే ఉంది!
ఒకామె చెవిలో గుసగుసలాడింది...
ఈ చెట్టు కిందే ఉంటానని...
చెట్టు ఇప్పటికీ ఉంది, ఆమె లేదు...
గూటిలో ఎదురుచూపు మాత్రమే మిగిలింది!.
ఊరి చెరువు కట్ట మీద నాయకుడు....
నీళ్ల తెస్తానని చెయ్యెత్తి చెప్పాడు....
చెరువు ఎండింది, చెయ్యి మాత్రం...
పోస్టర్లలో ఇంకా ఎత్తే ఉంది!.
చివరకు నేను నా నీడతో అన్నాను....
ఎవరికీ ఏ వాగ్దానం చేయకు....
వాగ్దానం మాట కాదు, మౌనం..
చేసి చూపించిన తర్వాతే చెప్పే మౌనం!.
వాగ్దానాలు పువ్వులు కావు....
వాసన చూడటానికివి విత్తనాలు....
నేలలో దాచిమొలకెత్తే వరకు
కాపాడాల్సిన విత్తనాలు!!!

**-డా. ఆళ్ళ నాగేశ్వరరావు**
7416638823



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా|| రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.
ఈ వారం వచన కవితల వర్క్ షాప్...అంశం "వాగ్దానాలు". విజేతల కవితలు చదవండి.

-డా||రావి రంగారావు
9247581825

-సంపాదకులు

## వాగ్దానం

వాగ్దానం
అభయ హస్తమే అయితే..
ఆకలి అగ్ని గుండాన్ని
అన్నంతో చల్లార్చాలి
వంగి వడలిన మొక్కకు
ఊత కర్రగా నిలవాలి
అప్పుల బావిలో మునిగిన
వాడిని చాంతాడై లాగాలి
నిత్యం దీవించే అమృత
హస్తాలు కావాలి.
వాగ్దానం
కట్టు బాటే అయితే..
అందరి మనసుల్లో
గూడు కట్టుకోవాలి
మాటదాటని గీత కావాలి
పంటను కాపాడే కంచె కావాలి
అందరిని కలిపి నడిపించే
బాట కావాలి
అప్పుడు పుటలన్నీ కలిపి
కుట్టిన కావ్యం నీవౌతావు.
వాగ్దానం
ప్రతిజ్ఞ అయితే...
భావోద్వేగం కాదు,
భవితకు భరోసా...
ఊక దంపుడు ఉపన్యాసం
కాదు
ఊరికి ఉపకారమయ్యే
మంచి మనసు...
వాగ్దానం
నమ్మకం అయితే...
నీతిని నిలబెట్టే
ధర్మ వాక్యం కావాలి,
నిర్భయ అబలలకు
ఆలంబన కావాలి
వాగ్దానం అంటే..
అరచేతితో స్వర్గం కాదు,
అరచేతిలో అన్న పూర్ణ
మౌనంగా శ్రమించే
చీమల క్రమ శిక్షణ,
అవసరానికి తనువును
చీల్చి ఇచ్చే తరువు.

**-పగడాల వెంకటరెడ్డి**
7993422614

## రంగులు మారిన వాగ్దానాలు

వాగ్దానాలు
ఒకప్పుడు...
తప్పుకోకుండా ఉంటానని
ఒప్పించే ఆనవాళ్లు,
భయాన్ని పోగొట్టేందుకు
అభయాన్ని అందించే
ఆయుధాలు,
కానీ... ఇప్పుడు
అబద్దానికి పుట్టించిన
కొత్త అర్థాలు వాగ్దానాలు,
మనిషిని మనిషి నమ్మని
ఈ ప్రపంచంలో
మోసానికి పెట్టుకున్న
ముద్దు పేర్లు...
వాగ్దానాలు,
ఒక వాగ్దానం
ఓట్లు కురిపిస్తే
ఒక వాగ్దానం
కన్నీటిని తుడుస్తుంది
ఒక వాగ్దానం
రేపటిని నమ్మిస్తే
ఒక వాగ్దానం
నేటిని చంపేస్తుంది...
ఒక వాగ్దానం
రాజకీయాలకు రాచమార్గం,
ఒక వాగ్దానం
వ్యాపారాలకు ప్రచారాస్త్రం,
ఒక వాగ్దానం
అవినీతికి అందమైన ముసుగు
ఒక వాగ్దానం
అందరినీ నమ్మించే పెద్ద
లొసుగు...
ఇలా... ఈరోజు...
వాగ్దానం రంగు మార్చుకుంది
వాక్ కున్న విలువ మర్చిపోయేలా
చేస్తుంది.

**-శ్రీఅరుణం శ్రీనివాస్**
9866898477

## వాగ్దానం

ఒకప్పుడు వాగ్దానమంటే
నోటిమాట ఇచ్చిన భరోసా!
గుండె లోతుల్లోంచి ఉదయించి
భయాన్ని ఊరడించే ఆభరణం.
తప్పుకోని నమ్మకానికి
అలుపెరగని సత్య స్వరూపం!.
నిజమైన వాగ్దానం
మాటల కోట కట్టదు,
చేతల పాటై సాగుతుంది.
తీపి పలకరింపుల మాయ
కాదు,
నిలకడతనపు నిజాయితీ!
బాధ్యత ఉన్న మనసు నుంచి
జీవనదిలా
ప్రాణం పోసుకుంటుంది.
కానీ కాలం మారింది...
నేడు వాగ్దానమంటే
నగ్న అబద్ధానికి తొడిగిన
రంగుల ముసుగు!
మనిషిని మనిషి
చౌకగా అమ్మేసే
వ్యాపార వ్యూహం!
ఒకరి కన్నీటిని తుడుస్తున్నట్టు
నటిస్తూనే
మరొకరి నమ్మకాన్ని నిలువునా
పూడ్చే నయవంచన!.
నీటిపై రాసే అక్షరం
కాదు వాగ్దానం,
ఆశలతో అడుగులేసే
ఆత్మీయ బంధం.
పరిపాలనైనా,
ప్రాణ బంధమైనా?
నిలబెట్టుకోలేనప్పుడు
ఇచ్చే వాగ్దానం
విశ్వాసానికి
చేసే హత్యాకాండ!.
వంచించడం కాదు,
పవిత్రంగా నెరవేర్చడమే
వాగ్దానం!
మాట తప్పని చోటే
మనిషి గెలుస్తాడు...
ఆ నమ్మకం నిలిచిన చోటే
సృష్టి మురిసిపోతుంది!

**-బూరెడ్డి రామకృష్ణారెడ్డి**
7382546949



## వాగ్దానం

హరివిల్లును
కత్తిరించి
మీ ఒంటికి తొడుగులు
కుట్టిస్తాను .
వెన్నెల సముద్రాన్ని
చిలికి
వెన్నముద్దల
తినిపిస్తాను .
సముద్రపు
అలలు పట్టి
మీకు ముత్యాల
హారాలు పొసుగుతాను .
ఆకాశానికి నిచ్చెన వేసి
నక్షత్రాల పూలతో
మీ గుమ్మాలకు
తోరణాలు కడతాను.
మీ కడుపు చాటు ఆకలికి
చందమామ రొట్టెను
కాల్చి మీ చేతుల్లో పెడతాను.
నన్ను నమ్మండి
ఇది నిజం నేను మీకోసమే
పదవి కోరుకునేది..
మీ సేవలో తరిస్తాను
ఏం పథకం వేసిందో
దొంగ కన్నుల ముని కొంగ

**-నేలపూరి రత్నాజీ**
8919998753

## అభ్యుదయ కవితా మహా ప్రస్థాన యంగకర్త మహాకవి శ్రీశ్రీ




సభలో ప్రసంగిస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ విశ్వేశ్వరరావు. వేదికపై శైలజామిత్ర, కళా జనార్ధనమూర్తి తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 14: తెలుగు సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవితా మహా ప్రస్థాన యుగకర్త మహాకవి శ్రీశ్రీ అని, శ్రీశ్రీ రాసిన కవిత్వం శాశ్వతంగా నిలిచి ఉంటుందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ విశ్వేశ్వరరావు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గానసభలోని గుండవరపు హనుమంత రావు కళా వేదికపై ఎందరో మహానుభావులు మధుర స్మృతుల పరంపరలో భాగంగా మహాకవి శ్రీశ్రీ (శ్రీ రంగం శ్రీనివాసరావు) యాదిలో సమావేశ సభను నిర్వహించారు.

ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో భావ కవితా యుగానికి రాయప్రోలు సుబ్బారావు బాటలు వేస్తే, అభ్యుదయ సాహితీ యుగ కర్త గురజాడ కాగా, వారి అడుగు జాడల్లో ముందు భావకవిగా తన రచనా ప్రస్తానం ప్రారంభించిన శ్రీశ్రీ మహా ప్రస్థానం కావ్యంతో అభ్యుదయ కవిగా ప్రజల పక్షాన నిలిచి ప్రజాకవిగా గుర్తింపు పొందారని అన్నారు. రచయిత్రి శైలజామిత్ర మాట్లాడుతూ... మహాకవి శ్రీశ్రీ రాసిన సాహిత్యానికి ప్రభావితులై ఎందరో యువకులు ముందుకు వచ్చి చక్కటి సాహిత్యం రాశారని చెప్పారు. శ్రీశ్రీ రాసిన సినీ పాటలన్ని ప్రజాదరణ పొందాయని ఆమె చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై నవరస గాయని ఆమని, మోహనకృష్ణ పాల్గొన్నారు.

## శ్రీశ్రీ కవిత్వ దర్శనం

పుస్తక సమీక్ష






ప్రతులకు:
డా||వైరాగ్యం ప్రభాకర్
ఇ.నెం.2-102,
సీతారాంపూర్,కరీంనగర్-505 002.

శ్రీరంగం శ్రీనివాసరావు.. శ్రీశ్రీ ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన మహాకవి. ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి, మనకవి. కొందరు విప్లవకవి అనీ, నాస్తికుడు అనీ, సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని దిక్కరించిన కవి అనీ ఎన్నో విధాలుగా ఎవరికి తోచిన ట్లు వారు వర్ణించు కుంటూ పోయారు. శ్రీశ్రీ కవిత్వంపై ఎన్నో వ్యాసాలూ, ఎన్నో రచనలూ వెలువడ్డాయి. శ్రీశ్రీ ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి. ప్రజల పక్షాన ముఖ్యంగా శ్రామిక, కార్మిక, కర్షక వర్గాలను ఆదుకోడానికి తన స్వరంలో కవిత్వం పలికించిన వామనుడు. మొత్తం 129 మంది కవులు శ్రీశ్రీని వారి కవితల్లో బంధించి మనకు అందించే ప్రయత్నం గావించారు. "మనలో శ్రీశ్రీ" గ్రంథాన్ని డా|| వైరాగ్యం ప్రభాకర్‌గారి సంపాదకత్వంలో 130 పేజీల్లో విభిన్న ధోరణుల్లో, అక్షర రమ్యంగా అందించి కృత కృత్యులయ్యారు. శ్రీశ్రీని పొగడాలంటే మాటలు మిగల్లేదు. కవితలకు మాటర్ వుండదు. ఎందుకంటే వందలాది మంది ఇప్పటికీ తెలుగులో వుండే పొగడ్తల మాటల్ని వాడేసారు. నాకైతే ఇంకా ఏమి మిగిలిందని శ్రీశ్రీ గురించి రాయడానికి అనిపించింది. కానీ ఊట బావి మన తెలుగు సాహిత్యం. ఎంత తోడుకున్నా అంత వుంది ఇంకా పాతా ళ్ళంలో నీటి ఊట బావిలాగాను, తెలుగు బాగా రాయాలంటే ఆంగ్లం బాగా చదవాలని చమ త్కరించిన ఆధునికానంతరుడు అన్నారు తిరువాయపాటి రాజగోపాల్. శ్రీశ్రీ ఓ చైతన్య శక్తి అని సరస్వతి శ్రీ రామరాజు, యువతరానికి స్ఫూర్తి కెరటం అని ఎం.ఎన్. వి. సూర్యకుమారి, యుగాని కొక్కడు అని కాంచరాన భుజంగ రావు, అక్షర సూర్యుడు అని అక్షరం ప్రభాకర్, యుగ పురుషుడు అని జి.కె.నారాయణ, కణకణమండే నిప్పుకణం అని కవి కోకిల కోఠారి వెంకటరత్నం, నవయుగ వైతాళికుడు అని డా|| భమిడిమఱ్ఱి కమలాదేవి, చంద్ర కళ ధీకొండ.. ఇలా ఎందరో కవులు ఘనంగా ప్రశంసల వర్షం కురిపిం చారు. శేషాచారి నిత్య చిరంజీవి అంటే షేక్ అబ్దుల్ హకీమ్ మహా మనిషి అన్నారు. కొందరికి చైతన్య జ్వాలగా, నిప్పుకణంగా, జ్వలించే అక్షరంగా, ఆగని అక్షర జ్వాలగా కనిపించినా, మరికొందరికి తిరుగులేని కవిగా అగు పించారు. పద్యాల్లోనూ, పాటల్లోనూ, కవితల్లోనూ అగ్నిపూలు పూయించా రని శ్రీధర్ కొమ్మోజు అక్షర నీరాజనా లు అందించారు. సామాజిక సాహితీ రంగంలో మరణం లేని మహాకవి శ్రీరంగం అంటారు బాలార్జున సత్యనారాయణ మాకే. సినీ జనానికి తరగని ఆనందం పంచిన సినీకవి అంటూ కవితను రాసారు కవిత వేంకటేశ్వర్లు. మామిడి హరికృష్ణ అన్న ట్లుగా తెలుగువారు ఉన్నంతకా లం, తెలుగు జాతి ఉన్నంత కాలం మన భాష ఉంటుంది. మన సంస్కృతి ఉంటుంది. పండుగలు ఉంటాయి, అలాగే శ్రీశ్రీ కవిత్వం కూడా శాశ్వతం గా ఉంటుంది అని చెప్పడానికి ఈ కవితా సంకలనం ఒక నిలువెత్తు ఉదాహరణంగా నిలుస్తుంది. శ్రీశ్రీ అక్ష రోద్యమం నడిపిన ప్రజాకవి. అందుకే శ్రీశ్రీ కాలాన్నీ, లోకాన్నీ, జీవితాన్ని వడబోసిన ప్రాచీన ఆధునిక కవిత్వ పాఠశాల అన్న ఎస్.ఆర్. భల్లం గారి మాటలు నిజం. వైరాగ్యం వారి ఈ కవితా యజ్ఞానికి తోడ్పాటు అందించిన భవాని సాహిత్య వేదిక కరీంనగర్ వారు అభినందనీయులు.

ఇదొక మంచి సాహితీ ప్రయోగం.



**- డా|| పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761

## సమాజ హితాన్ని కోరే రచనలే నిలబడతాయి..
### -సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్




పుస్తకావిష్కరణలో అతిథులు శైలజామిత్ర, దాస్యం సేనాధిపతి, మౌనశ్రీ మల్లిక్, పెద్దూరి వెంకటదాసు మదన్ మోహన్ రెడ్డి , తూర్పు మల్లారెడ్డి తదితరులు

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, సాహితీ కళాభారతి ఆధ్వర్యంలో ప్రముఖకవి హరీష్ కుమార్ శర్మ రచించిన **'అగ్ని గవాక్షం'** కవితా సంపుటి ఆవిష్కరణసభ హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో వైభవంగా జరిగింది.

కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త దాస్యం సేనాధిపతి అధ్యక్షతన జరిగిన వేడుకకు ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి, సినీటీవీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ విచ్చేసి, పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలిప్రతిని రచయిత అక్కా బావలు త్రివేణి రవీంద్రాచా ర్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ... సమాజం హితం గూర్చి నిరంతరం చేసే ఆలోచనలే అద్భుతమైన కవితలుగా ఆవిష్కరించబడతాయని అటువంటి సమాజహితుడు హరీశ్ కుమార్ శర్మ అని, ప్రపంచాన్ని మార్పు దిశగా నడిపించేది కవిత్వమొక్కటే అన్నారు. సమాజానికి ఆదర్శంగా ఉండే రచనలే విలువను పొందుతుందన్నారు. సమాజాన్ని తాత్విక దృష్టితో చూస్తూ, ఈ పుస్తకాన్ని రచించిన వాగ్దాన కవి హరీశ్ శర్మ అన్నారు. కవిత్వం అనేది ఒక ప్రత్యేకమైన భాష అని పేర్కొన్నారు.

ప్రముఖ సాహితీవేత్త శైలజామిత్ర పాల్గొని గ్రంథ విశేషాలను కొనియాడారు.ప్రముఖ కవి, కథారచయిత పెద్దూరి వెంకటదాస్ రచయితకు శుభాకాంక్షలు తెలియజేయగా, విశిష్ట అతిథిగా పాతూరి వెంకట్రావు, ఇతర అతిథులు మదన్ మోహన్ రెడ్డి , తూర్పు మల్లారెడ్డి కవిని అభినందించారు.

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'ముసునూరు నాయకులు' చారిత్రక నాటక ప్రదర్శన వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి.

కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1905వ రోజు 'స్మిత్ మచ్చర్' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'స్మిత్ మచ్చర్' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & నిర్వహణ
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు,**
9441046839

## మచ్చ లేని మానవత్వం

తే. గీ. స్మిత వదనుడు భారత సిగను పూవు
మచ్చరముమెంత లేనట్టి మంచి మనిషి
కత్తి పోటులు దిగమింగి కార్య దీక్ష
సడలి పోని ధైర్యంబును కడకు మిగిలె !!.

వాయు వేగము తోడను కాయునట్టి
ఘనుడు పైలటు మనవాడు గాలిలోకి
ప్రాణములను కలవకుండ రక్షచేసి
భరత మాత ఋణము తీర్చ మురిసిపోయె!!.

దొంగ చేతికి చిక్కక లొంగిపోక
భద్రము గాను చేర్చెను తాను ఫలితముగను
నూట ఎనిమిది మందిని నోటి బువ్వ
పెట్టిన ఘనుడు పైలటు గట్టివాడు!!.

ప్రాణమడ్డు పెట్టియు పెట్టె ప్రాణ భిక్ష
అంతరిక్షాన సాహసి అలుపు లేక
మొక్కవోనట్టి దీక్షతో చక్క బెట్టి
విశ్వ జనులను రక్షించె విశ్వ శాంతి!!.

**-డా. చీదెళ్ళ సీతాలక్ష్మి**

## మానవతా దృక్పథం!

మనిషిని మనిషే
ద్వేషించే మతోన్మాదం
అమానుష తత్వంతో
రెచ్చిపోతున్న ఉగ్రవాదం
విధ్వంసానికి పాల్పడుతున్న
పైశాచికత్వం.
దేశాల మధ్య
సంబంధాలను చెదరగొట్టేందుకు
ఉగ్రవాద సంస్థల
దుశ్చర్యలు పెరిగిపోతున్నాయి
ఈర్ష్యా ద్వేషాల
అమానుషత్వాల సుడిగుండంలో.
స్మిత్ మచ్చర్
వైమానిక పైలెట్ గా
కో పైలెట్
పైదుబాయ్ కో కెప్టెన్
ఉన్మాదం
విమానాన్ని కిందికి
పడదోయాలనే ప్రయత్నం
కొడవలితో దాడి
తలపై పిడిగుద్దులు
గుద్దుతున్నా మేల్కొన్న కర్తవ్యనిష్ట.
దెబ్బలకు రక్తం కారుతున్నా
అపస్మారక స్థితిలోకి పోతున్నా
అందరి ప్రాణాలకు రక్షణ కోసం
మానవ ప్రయత్నం చేశాడు
స్థిర సంకల్పంతో
అందరి ప్రాణాలకు
రక్షగా నిలిచాడు
అలుపెరగని పోరాటం చేశాడు.
కో పైలెట్ కుట్రను
వమ్ముచేశాడు
పెద్ద ప్రమాదం నుండి
విమాన ప్రయాణికుల్ని రక్షించాడు
సాహస ధైర్యంతో ఎదురొడ్డి
మానవతా దృక్పథంతో
యువతకు స్ఫూర్తిగా నిలిచాడు
త్యాగధనుడిగా
భరతమాత
ముద్దుబిడ్డగా నిలిచాడు
స్మిత మచ్చర్
ప్రపంచానికే హీరోగా నిలిచాడు.

**-పి.పద్మావతి**

## కర్తవ్యదీక్షలో త్యాగధనుడు

వాయుగగనాన
విమానాన్ని నడిపే చాలకుడా!
నీ కర్తవ్యనిష్ఠతో ప్రాణాలనే వొడ్డి
తోటి చాలకుడి దురాగతాన్ని
నమ్మకద్రోహాన్ని
అమాయకుల ప్రాణాలను
ఎరగొనే దుశ్చేష్టలను
ఎదుర్కొన్న సాహసవీరుడా!
నీ సమయస్ఫూర్తితో
అప్రమత్త చర్యతో
అసాధ్యాన్ని సుసాధ్యం
చేసి చూపిన కుశల ప్రమత్తుడా!
అతి పెద్ద ప్రమాదాన్ని
అనేక ప్రయాణికుల ప్రాణాల్ని
కాపాడి నిలిచిన నీ సాహసం
అత్యుత్తమం.
మూర్ఖ తీవ్రవాదులను హెచ్చరించు
హింసాకాండలు వదిలి
శాంతి మార్గంతో
చూపించు కనువిప్పు.
తలచుకుంటేనే
గగుర్పొడిచే క్షణాలు
సెకండ్ల వ్యవధిలో
తోటి ప్రయాణికుల సహకారంతో
గాలిలో మృత్యుదేవతని
వలదని వెనక్కు పంపగలిగిన
వీరాధి వీరుడివి.
ప్రపంచమంతా కొనియాడింది
కర్తవ్యదీక్షలో త్యాగనిరతికి
త్యాగధనుడివి
ఆప్తమిత్రుడివయ్యావు
భారతీయుడిగా
మానవతా ఆదర్శాలకు
ప్రతీకగా నిలిచావు.
మేమందరం
గర్వించదగ్గ విషయం.
గాయాలతో
క్షతగాత్రుడివైన నువ్వు
త్వరగా కోలుకోవాలి
మళ్ళీ పూర్తి ఆరోగ్య ఆనందాలతో
నిన్ను మేం చూడాలి.

**-రాజప్ప**

## స్మితం హసితం!

స్మితం హసితం
వికసిత భారతంలో
మచ్చలేని మచ్చర్
ఒక్క రోజులో
విశ్వానికే హీరో
దేశాల ద్వేషాలు
మనుషుల అసూయలు
మత్సరాలు
ఒంట్లో కత్తిపోట్లతో
మొక్కవోని ఆత్మ స్థైర్యం
సమయస్ఫూర్తి ఉన్న సాహసికుడు
భారతమాతకు కంటివెలుగు.
కుటుంబ వస్త్రవ్యాపారానికి
టెక్స్ టైల్ ఇంజనీరుగా రాణించి
పందొమ్మిదేళ్ల వయసులో
పైలెట్ శిక్షణ
స్పైస్ జెట్ లో జర్నీతో
ఫ్లైదుబాయ్ లో
కెప్టెన్ గా సందేశం.
విమానంలో డాక్టర్లు
నర్సులుండాలన్న సూచన!
విధి ఆడిననాటకం
కోపైలెట్ కత్తిపోట్లకు
స్మిత్ సమయస్ఫూర్తితో రక్షణ
వ్యక్తిత్వం
మచ్చలేని మానవత్వం
హనుమాన్ చాలీసా మదిలో
ఉప్పొంగె గంగ ఆయనలో.
ఒక్కరోజులో
ప్రపంచానికే హీరో
నటుడు రాజకీయనేత కాకున్నా
పైలెట్‌గా
ప్రశాంత స్మితవదనం
ప్రపంచమంతా ప్రశంసలజల్లు
అజేయుడై చరిత్రలో రికార్డు.

**-ఎ.రాజ్యశ్రీ**

## దురాగతానికి అడ్డుకట్ట!!

ఆకాశవీధిలో హాయిగా ఎగిరే విమానం
ఒక్కసారిగా కుదుపులకి గురై
ప్రయాణికుల్లో భయభ్రాంతులు
కాక్ పిట్లో గందరగోళం
సహ పైలెట్ ముసుగులోని
తీవ్రవాది నుండి
ప్రధాన పైలెట్ కు
ప్రాణాంతకగాయాలు!.
కొనఊపిరితోనూ
ప్రయాణికుల భద్రత కోసం
కాక్ పిటు తలుపుతీసి
ఒరిగిన స్మిత్ మచ్చర్
విమాన ప్రయాణంలో
ఆదర్శనీయుడు!.
నేలనుండి నింగికి
విస్తరించిన తీవ్రవాదం
ఒక్క నిముషంలో
వందల ప్రాణాలకు హానిగా
పన్నిన కుట్ర విఫలమైన రోజు
విశ్వ ప్రయాణికులు
అందరికీ పండుగరోజు!.
వృత్తిలో అంకిత భావన
తక్షణ స్పందనకు సంకల్పం
ఏకదీక్షగా తలుపు
గుంద్రనినాబ్ తిప్పడం
ప్రయాణికులచే రక్షణ
కుట్ర వెల్లడి
వైమానిక దళంలో
మరింత జాగరూకత అవసరమైన
విషయం నొక్కి చెప్తూ
భారతదేశ మూలాలలోని
మానవీయత
నేడు ఆదర్శంగా
స్మిత్ మచ్చర్
రూపంలో ఉందన్న
దేశాధ్యక్షుని మాట
చికిత్స పొందుతూన్న
స్మిత్ కళ్ళలో మెరుపు!
ఆదర్శనీయుడు
స్మిత్ మచ్చర్ కు జేజేలు!!.

**-ఎం.వి.ఉమాదేవి**

## భారత బంధువు

పదిహేడు వేల అడుగుల ఎత్తులో
ఊహించని ఉపద్రవం!
వాహనం తల్లకిందులయ్యే
ప్రమాదం!.
సహ చోదకుడే శత్రువై
పదునైన ఆయుధంతో
చేతులపై, ముఖంపై
చేసిన గాయాలు
ధారగా రక్తమోడుతున్నా
ఊపిరందక
ఉక్కిరిబిక్కిరి అవుతున్నా
కళ్ళు మూతలు పడిపోతున్నా.
కళ్ళు మూసుకున్నా
విమానానికి ఏమైందో
తెలుసుకోగలిగిన
పదిహేడేళ్ల విమానచోదక
అనుభవంతో కూడిన సామర్థ్యం!.
గాయాలను లెక్కచెయ్యక
హుటాహుటిన తీసుకొంది నిర్ణయం!.
ఆ కళ్ళల్లో ఒకే ఆత్రుత
ఒకే ఆరాటం
ఒక్కటే లక్ష్యం.
విమానంలోని నూట డెబ్భైకి పైగా
ప్రయాణికుల ప్రాణాలు
ఎలాగైనా కాపాడాలనే ధ్యేయం
తనలో
వీరసైనికుని ఆవహింపజేసింది!
ఒకే తన్నుతో తటాలున
కాక్ పిట్ తలుపు
తెరుచుకునేలా చేసింది!.
ప్రయాణికులందరిలో
ధైర్యాన్ని ప్రోది చేసింది
ఉగ్రవాదిని బంధించేలా
ఉసిగొల్పింది!.
అతనిని ధీరసింధువుగా
భారత బంధువుగా నిలిపింది!.
మందస్మిత చందమామా!
మచ్చర్!
నీ కర్తవ్యనిష్ఠకు సహనానికి
జేజేలు! జయహోలు!.

**-చంద్రకళ దీకొండ**

